విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 228 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 8 జనవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పరిశీలించిన సీఎం..





**ఉన్నతాధికారులతో సమీక్షలో పలు సూచనలు చేసిన చంద్రబాబు**

**పోలవరం, జనవరి 07:** ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్నారు. సిఎం కు పోలవరం ప్రాజెక్టు హెలిపాడ్ వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి స్వాగతం పలికారు. అంతకు ముందు ఏరియల్ విజిట్ ద్వారా పోలవరం ప్రాజెక్టులో పనుల పురోగతిని పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి స్పిల్ వే సహా మొత్తం ప్రాజెక్టును ముఖ్యమంత్రి పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టులో డయా ఫ్రమ్ వాల్ సహా ఇతర నిర్మాణాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనలో భాగంగా బుధవారం హెలికాప్టర్‌లో 11.30 నిమిషాలకు పోలవరం చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు

వివరాలు 2లో..

## పోలవరం ప్రాజెక్ట్ సైట్ వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం






పోలవరం, జనవరి 07: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం పనుల పురోగతిని సీఎం స్వయంగా పరిశీలించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఉండవల్లి లోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరిన సీఎం చంద్రబాబు నేరుగా పోలవరం వెళ్లారు. ఎరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ తో పాటు, కాఫర్ డ్యామ్, బట్రస్ డ్యామ్, ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులను పర్యవేక్షించారు. నిర్మాణం చివరి దశకు చేరుకున్న డయాఫ్రమ్ వాల్ ను కూడా సీఎం తనిఖీ చేశారు. అనంతరం ప్రాజెక్ట్ సైట్ వద్దనే అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు సైట్ వద్ద అధికారులతో సమీక్షలో భాగంగా సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్ధసారధి, నాదెండ్ల మనోహర్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లుకు

వివరాలు 2లో..

## టాటా కంపెనీ రూ.6675 కోట్ల పెట్టుబడి..




**అమరావతి, జనవరి 07:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులు పెడుతోంది. ఏపీలో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ రూ.6,675 కోట్లు పెట్టుబడులు పెడుతోంది. ఈ పెట్టుబడితో దేశం లోనే అతిపెద్ద ఇంగోట్ అండ్ వేఫర్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఏపీలో ఏర్పాటు చేయనున్నారు. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ 10 గిగావాట్ సామర్థ్యంతో దేశం లోనే అతిపెద్ద ఇంగోట్ అండ్ వేఫర్ తయారీ ప్లాంట్‌ను నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంట్ ద్వారా దేశీయంగా సౌర పరికరాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా వేయి మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దేశం లోనే అతిపెద్ద ఇంగోట్ అండ్ వేఫర్

వివరాలు 2లో..

## వెనిజులా చమురు నౌకను సీజ్ చేసిన అమెరికా..




జనవరి 3 న వెనిజులా పై అమెరికా సైన్యం వైమానిక దాడులను చేపట్టిన విషయం తెలిసిందే. వెనిజులా రాజధాని కరాకస్ లోని ఏడు కీలక ప్రాంతాల పై దాడులకు పాల్పడింది అమెరికాకు చెందిన డెల్టా ఫోర్స్. అనంతరం వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో అతని భార్య సిలియా ఫ్లోర్స్ ను కస్టడీ లోకి తీసుకుని న్యూయార్క్ కు తరలించింది. అయితే తాజాగా వెనిజులాకు చెందిన చమురు నౌకను అమెరికా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు 2 వారాలపాటు ఛేజింగ్ చేసి మరీ చమురు నౌకను తమ అధీనం లోకి తీసుకున్నట్లు సమాచారం. అమెరికా సైన్యం వెనిజులా పై దాడులు చేపట్టిన తర్వాత వెనిజులాకు చెందిన చమురు నౌక మరినెరా ను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

వివరాలు 2లో..

## సాక్షి పై పరువునష్టం కేసులో న్యాయం నా వైపు ఉంది, తప్పకుండా గెలుస్తాను

- **చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు లోకేష్.**
- **ప్రజలు ఏ నమ్మకంతో గెలిపించారో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది.**
- **విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాఫిట్ లో నడవాలని మేం అందరం కోరుకుంటున్నాం.**
- **ఎర్రబస్సు రాని ఊరికి ఎయిర్ పోర్ట్ అవసరమా అని ఆనాడు జగన్ రెడ్డి ఎగతాళి చేశారు.**
- **ఫార్చ్యూన్-500 కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూమి ఇస్తాం, తప్పేంటి?.**
- **చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధాని అమరావతిని తరలించలేకపోయింది.**
- **శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం మంత్రి లోకేష్.**

**విశాఖపట్నం, జనవరి 07:** సాక్షి పై పరువు నష్టం కేసులో క్రాస్ ఎగ్జామినేషన్ కోసం కోర్ట్ కు హాజరు అయ్యారు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ క్రమ శిక్షణ, పట్టుదలతో ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో గెలిపించారో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మా పై ఉందన్నారు. సాక్షి పత్రిక పై వేసిన పరువు నష్టం కేసులో న్యాయం నా వైపు ఉంది, తప్పకుండా గెలుస్తానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తన పై సాక్షి పత్రిక ప్రచురించిన అసత్య కథనం పై పరువు నష్టం కేసులో బుధవారం విశాఖ 12 వ అదనపు జిల్లా న్యాయస్థానంలో క్రాస్ ఎగ్జామినేషన్ కు మంత్రి హాజరయ్యారు. క్రాస్ ఎగ్జామినేషన్ ముగిసిన అనంతరం విలేకరుల సమావేశంలో

వివరాలు 2లో..






## నకిలీ మద్యం కేసులో నలుగురికి పోలీస్ కస్టడీకి ఎక్సైజ్ కోర్టు గ్రీన్ సిగ్నల్

**విజయవాడ, పెన్ సత్తా, జనవరి 07:** గత కొన్ని నెలల నుంచి సంచలనంగా మారిన విజయవాడ నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురుని విచారించిన ఎక్సైజ్ కోర్టు తాజాగా మరో నలుగురిని విచారించేందుకు అనుమతినిచ్చింది. అన్నమయ్య జిల్లా ములకల చెరువు, విజయవాడ కేంద్రంగా వెలుగు చూసిన నకిలీ మద్యం రాకెట్ లో ప్రధాన నిందితులకు సహకరించిన వారిని పోలీసులు తమ కస్టడీ లోకి తీసుకున్నారు. తాజాగా నకిలీ మద్యం కేసులో బాలాజీ (ఏ 3), తలారి రంగయ్య (ఏ 14), సుదర్శన్ (ఏ 21), ప్రసాద్ (ఏ 23) లను శుక్రవారం నుంచి సోమవారం వరకు కస్టడీకి ఎక్సైజ్ కోర్టు అనుమతినిచ్చింది. నిందితుల నుంచి మరింత కీలక సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం

వివరాలు 2లో..

## వైసీపీ ఎమ్మెల్యేలకు షాక్ తప్పదా.. ఎథిక్స్ కమిటీ కీలక నిర్ణయం..




అమరావతి, జనవరి 07: అసెంబ్లీకి రాని వైసీపీ ఎమ్మెల్యేల విషయంలో ఎథిక్స్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీకి రాకుండానే వైసీపీ ఎమ్మెల్యేలు జీతాలు తీసుకుంటున్నారని ఎథిక్స్ కమిటీ సభ్యులు అభిప్రాయ పడ్డారు. ఈ నేపథ్యంలో సభకు రాని ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి, వారి నుంచి వివరణ తీసుకోవాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది. వివరణ తీసుకున్న తర్వాత ప్రజాభి ప్రాయం ప్రకారం ముందు కెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. బుధవారం రోజున ఎథిక్స్ కమిటీ భేటీ యై ఈ అంశం పై చర్చించింది.

వివరాలు 2లో..

## పవన్ కళ్యాణ్‌ను కలిసిన మధ్యప్రదేశ్ ఎంపీ. పుంగనూరు నేతల పై ఫిర్యాదు.

వెలగపూడి, జనవరి 07: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపీ ఫగ్గన్ సింగ్ కులస్తే భేటీ అయ్యారు. బుధవారం రోజున సచివాలయంలో పవన్ కళ్యాణ్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పుంగనూరు నియోజకవర్గం లోని సదుంలో కొందరు నాయకుల ఆగడాల పై పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు చేశారు. సదుంలో మైనింగ్ కోసం మధ్యప్రదేశ్ వాసులకు అనుమతులు లభించాయని, కానీ కొంత మంది

వివరాలు 2లో..



## చట్టాలను ఉల్లంఘిస్తే వీసా రద్దు..

**ఇండియన్ స్టూడెంట్స్ కు అమెరికా వార్నింగ్**




భారత్ లోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం విద్యార్థుల కు కీలక హెచ్చరిక జారీ చేసింది. అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే వీసాలు రద్దు, దేశ బహిష్కరణ, భవిష్యత్తు ప్రయాణాల పై

వివరాలు 2లో..

# సాక్షి పై పరువునష్టం కేసులో న్యాయం నా వైపు ఉంది, తప్పకుండా గెలుస్తాను



మొదటి పేజీ తరువాయి
మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ 2019 లో ఆనాడు టీడీపీ ఓడిపోయినప్పుడు కుట్రపూరితంగా తప్పుడు వార్తలు రాసి, వ్యక్తిగతంగా నా పరువుకు భంగం కలిగించాలని నా ఫోటో పెట్టి, కింద క్యారికేచర్ పెట్టి అసత్య కథనం ప్రచురించారు. నేను విశాఖకు వచ్చినప్పుడు ఐదేళ్లలో ఎయిర్ పోర్ట్ లాంజ్ లో స్నాక్స్ కు రూ.25 లక్షలు ఖర్చుపెట్టానని రాశారు. చినబాబు చిరుతిండికి 25 లక్షలండి అనే టైటిల్ తో ఏకంగా నా ఫోటో పెట్టి ఆర్టికల్ రాశారు. ఆ రోజు నుంచే నేను సాక్షి పై పోరాటం మొదలు పెట్టాను. ఎవరిపైనైనా ఆర్టికల్ రాసేప్పుడు నిజానిజాలు నిర్ధారించు కోవాలి. సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి వారి అభిప్రాయం తెలుసుకోవాలి. అలాంటివేవీ చేయకుండా నన్ను కించపరిచేవిధంగా సాక్షిలో ఆర్టికల్ రాసి పబ్లిష్ చేయడం జరిగింది. దీని పై గత ఆరేళ్లుగా నేను పోరాటం చేస్తున్నాను. ఈ కేసు పై విశాఖకు రావడం ఇది ఏడోసారి. ఆ రోజు ద వీక్ అనే మేగజైన్ కూడా ఆర్టికల్ రాసినప్పుడు నోటీసులు పంపాను. ఏ తేదీలు అయితే ప్రచురించారో ఆ తేదీల్లో నేను విశాఖలో లేనని ఆధారాలతో సహా నిరూపించాను. అది తెలుసుకుని వారు రీజాయిండర్ వేసి, క్షమాపణలు కూడా కోరారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటించారు. ఈ స్టీల్ ప్లాంట్ భూములు విషయంలో ఎవరైనా స్టేట్‌మెంట్ ఇచ్చారా? అని విలేకర్లను ఆయన సూటిగా ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ భూములను వాటి అవసరాలకు తప్ప, మరే ఇతర అవసరాలకు వినియోగించ లేదని, వినియోగించ బోమని ఆయన స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో నడవాలని, అందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా లోకేష్ పిలుపు నిచ్చారు. బుధవారం విశాఖపట్నంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ కోసం ఎవరూ పోరాటాలు చేయడం లేదని లోకేష్ పేర్కొన్నారు. ఎర్ర బస్సు రాని ప్రాంతానికి ఎయిర్ పోర్టు ఎందుకని గతంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో జీఎంఆర్‌కు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ ఆ భూములను జీఎంఆర్‌కు కేటాయించామని వివరించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ క్రెడిట్ కావాలంటే తీసుకోవచ్చంటూ వైసీపీ వాళ్లకు లోకేష్ సూచించారు. చిత్తూరు జిల్లా నుంచి అమర్ రాజా బ్యాటరీస్ వెళ్లగొట్టిడం, పీపీలు రద్దు, పలు కంపెనీలను రాష్ట్రం నుంచి పంపేయడం, ఆఫీస్ అద్దాలు పగలగొట్టడం వంటి సంఘటనల క్రెడిట్ అంతా వైసీపీకే దక్కుతుందని లోకేష్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఒకటి రెండు నెలల్లో విశాఖపట్నం వేదికగా గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభమవుతాయని లోకేష్ చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టు కనెక్టింగ్ రోడ్ల పై దృష్టి సారించామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క 108 వాహనం ఆగలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చాలా 108 వాహనాలు ఆగిపోయాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఉద్యోగాలు కల్పించడానికే తక్కువ ధరలకు భూములు కేటాయిస్తున్నామని, అది కూడా సామర్థ్యం ఉన్న కంపెనీలకే ఇస్తున్నామని లోకేష్ వివరించారు. గత ఐదేళ్లలో వైసీపీ చేయలేని పని తాము ఇప్పుడు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్టు బడులు తీసుకు వస్తున్నామని తెలిపారు. రాజకీయ లబ్ది పొందటానికి కొంత మంది జల వివాదం చేస్తున్నారంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2020 లో అధికారంలో ఎవరున్నారని జలవివాదం పై ప్రశ్న అడిగిన విలేకర్లను లోకేష్ నిలదీశారు. గతంలో పట్టి సీమ దండగని వైఎస్ జగన్ అన్నారని గుర్తు చేశారు లోకేష్. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని ఎవరిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాష్ట్రానికి ఆర్థిక రాజధాని విశాఖపట్నం అని తెలిపారు. క్లస్టర్ బేస్డ్ అభివృద్ధి తమ నినాదమన్నారు. మహిళలను కించపరిస్తూ మాట్లాడితే ఉపేక్షించేదే లేదన్నారు. ఇప్పటికే తప్పుచేసిన రౌడీ షీటర్లను ఊరేగింపుగా పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్తున్నారని, ఈ తరహా విధానం రాష్ట్రం లోని పలు ప్రాంతాల్లో జరిగిందని మంత్రి లోకేష్ సోదాహరణగా వివరించారు.

# పవన్ కళ్యాణ్‌ను కలిసిన మధ్యప్రదేశ్ ఎంపీ.
# పుంగనూరు నేతల పై ఫిర్యాదు.

మొదటి పేజీ తరువాయి
మైనింగ్ కు అడ్డుతగులుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అలాంటి వారి పై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని పవన కళ్యాణ్ హామీ ఇచ్చారు. పుంగనూరులో మధ్యప్రదేశ్ వాసుల సమస్య పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. అధికార యంత్రాంగం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రాలు, ప్రాంతాలు వేరు వేరైనా మనమంతా భారతీయులమని, ఏ రాష్ట్రం వారు ఏ రాష్ట్రంలో అయినా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అలాగే ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఎక్కడైనా పనులు చేసుకోవచ్చని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. స్థానికేతరుల పేరుతో అనుమతులు ఉన్నా పనులు చేయకుండా అడ్డు తగిలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసలు విషయానికి వస్తే బుధవారం రోజున వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మాండ్లా ఎంపీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాల పై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం పరిధి లోని సదుంలో మధ్యప్రదేశ్ వాసులు గ్రానైట్ మైనింగ్ కోసం అనుమతులు పొందారని, అయితే స్థానిక నాయకులు మైనింగ్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని కులస్తే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు.

# పోలవరం ప్రాజెక్ట్ సైట్ వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం

మొదటి పేజీ తరువాయి
దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టులో 87 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని, గడువు లోగా మిగతా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనుల పై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలన్నారు. పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనుల పై యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయాలని సూచించారు. పోలవరం ఎడమ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్న సీఎం, కుడికాలువ ద్వారా కొల్లేరు ప్రాంతాలకు కూడా నీరు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మే మొదటి వారంలో మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల్ని తనిఖీ చేస్తానని సీఎం వెల్లడించారు. గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన ప్రాజెక్టు పనులు, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పరుగులు పెడుతున్నాయి. ఈ 18 నెలల కాలంలో 13 శాతం మేర ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. మొత్తంగా ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు
నిర్మాణం 87.8 శాతం మేర జరిగింది. 2014-19 మధ్య కాలం లోనే ప్రాజెక్టులో సివిల్ పనులు 72 శాతం జరిగాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2025 వరకు 5 ఏళ్లలో కనీసం 2 శాతం పనులు కూడా చేపట్టలేదు. ఐదేళ్ల కాలంలో జరిగిన నష్టాన్ని పూరించేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు.

## చట్టాలను ఉల్లంఘిస్తే
# వీసా రద్దు..

మొదటి పేజీ తరువాయి
దీర్ఘకాలిక నిషేధం వంటి తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చింది. అమెరికా వీసా హక్కు కాదని, అది కేవలం ఒక ప్రత్యేక మైన వెసులుబాటు మాత్రమేనని, దేశంలోకి ప్రవేశం అక్కడ నిబంధనలకు పాటించడం పైనే ఆధారపడి ఉంటుందని కార్యాలయం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా అమెరికా రాయబార కార్యాలయం పోస్టు పెట్టింది. అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే మీ విద్యార్థి వీసాకు తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. మిమ్మల్ని అరెస్టు చేసినా లేదా ఏదైనా చట్టాన్ని ఉల్లంఘించినా, మీ వీసా రద్దు కావొచ్చు, మిమ్మల్ని బహిష్కరించవచ్చు, అలాగే భవిష్యత్తులో అమెరికా వీసాలకు మీరు అనర్హులు అయ్యే ప్రమాదం ఉంది. అందుకే ఈ నిబంధనలను పాటించండి, మీ ప్రయాణాన్ని ప్రమాదంలో పడేయకండి. అమెరికా వీసా హక్కు కాదు, అది ఒక విశేషాధికారం మాత్రమే అని స్పష్టం చేసింది. అమెరికాలో వలస నిబంధనల అమలు పై పర్యవేక్షణ పెరిగిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. విదేశీయులు చట్టపరంగా మాత్రమే అమెరికాలో నివాసం కొనసాగించాలని అధికారులు తరచుగా హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు డిసెంబర్ 26 నుండి నాన్-యూస్ పౌరులు (గ్రీన్ కార్డ్ హోల్డర్ లతో సహా) అందరికీ సరిహద్దు పాయింట్ల వద్ద తప్పనిసరి బయోమెట్రిక్ తనిఖీలు అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధన ప్రకారం, అమెరికన్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) అధికారులు విమానాశ్రయాలు, సరిహద్దులు, సముద్ర మార్గాల ప్రవేశ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద నాన్-యూఎస్ పౌరులందరి ఫోటోలు తీసుకుంటారు. 14 ఏళ్ల లోపు పిల్లల నుండి 79 ఏళ్లు పైబడిన వృద్ధుల వరకు, దేశంలోకి వచ్చేవారు లేదా బయలుదేరే వారందరికీ ఈ విధానం వర్తిస్తుంది. భద్రత, వీసా గడువుకు మించి నివాసం ఉండటం వంటి ఆందోళనలను పరిష్కరించడమే ఈ బయోమెట్రిక్ వ్యవస్థ లక్ష్యం అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్ఎస్) తెలిపింది. గతంలో పైలట్ కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైన నిష్క్రమణ బయోమెట్రిక్ సేకరణ ఇప్పుడు తప్పనిసరి చేసింది.

## వైసీపీ ఎమ్మెల్యేలకు షాక్ తప్పదా..
# ఎథిక్స్ కమిటీ కీలక నిర్ణయం..

మొదటి పేజీ తరువాయి
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేల పై చర్యలు చేపట్టేందుకు ఎథిక్స్ కమిటీ సిద్ధమవుతోంది. అయితే అసెంబ్లీ సమావేశాలకు రాని ఎమ్మెల్యేలకు తొలుత నోటీసులు ఇవ్వాలని, నోటీసుల పై వారి నుంచి వివరణ తీసుకోవాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలు రాకుండానే జీతాలు తీసుకుంటున్నారని చర్చించారు. టీఏ, డీఏలు కూడా పొందుతున్నారని భేటీలో ప్రస్తావనకు వచ్చింది. కొంత మంది వైసీపీ ఎమ్మెల్యేలు కేవలం సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని. ఆరుగురు అసెంబ్లీ సమావేశాలకు రాకుండానే జీతాలు తీసుకుంటున్నారని చర్చించారు. ఈ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలనే అంశం గురించి చర్చ జరిగింది. త్వరలోనే వీరికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది. మరో వైపు 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఎన్డీఏ కూటమి 164 చోట్ల విజయం సాధించగా, వైసీపీ కేవలం11 సీట్లకు మాత్రమే పరిమితం అయింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సామర్థ్యంలో 10 శాతం సీట్లు రాకపోవటంతో వైసీపీకి ప్రభుత్వం ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. అయితే సభలో ప్రతిపక్షం లేదని, తమకు ప్రతిపక్ష ం
హోదా ఇవ్వాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. ప్రతిపక్ష హోదా ఇచ్చేవరకూ అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకూడదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిర్ణయించారు. ప్రతిపక్ష హోదా ఇస్తే ప్రజాసమస్యల పై గళమెత్తేందుకు అవకాశం ఉంటుందని జగన్ చెప్తున్నారు. అయితే ఏపీ ప్రభుత్వం వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవటంతో వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు కావటం లేదు. ఎమ్మెల్సీలు మాత్రం మండలి సమావేశాలకు హాజరవుతున్నారు.

## నకిలీ మద్యం కేసులో నలుగురికి పోలీస్ కస్టడీకి ఎక్సైజ్ కోర్టు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి
ఉందని భావించిన ఎక్సైజ్ కోర్టు పోలీసుల విజ్ఞప్తి మేరకు ఈ కస్టడీని అనుమతించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాములను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా మరో నలుగురి కస్టడీ ద్వారా నకిలీ మద్యం కేసులో మరిన్ని కీలక అధారాలు లభిస్తాయని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

## టాటా కంపెనీ రూ.6675
# కోట్ల పెట్టుబడి..

మొదటి పేజీ తరువాయి
మ్యాను ఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. రూ.6,675 కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లాలో 10 గిగావాట్ల సామర్థ్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంట్ ద్వారా సెమీకండక్టర్ చిప్స్, సోలార్ సెల్స్, మాడ్యూల్స్ ఉత్పత్తిలో కీలక ముడిపదార్థా లైన ఇంగోట్స్, వేఫర్‌లు తయారు చేయనున్నారు. నెల్లూరు లోని ఇఫ్కో కిసాన్ స్పెషల్ ఎకనమిక్ జోన్‌లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. టాటా పవర్ కో అనుబంధ సంస్థ అయిన టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ ఈ ప్రాజెక్టు చేపడుతోంది. ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వం ఇఫ్కో కిసాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్ వద్ద 200 ఎకరాలను కేటాయించింది. కేటాయించిన రెండు వందల ఎకరాలలో 120 ఎకరాలు టాటా పవర్ ప్రాజెక్టుకు వినియోగించనున్నారు. మిగతా 80 ఎకరాలను భవిష్యత్తులో ప్లాంట్ విస్తరణ కోసం ఉపయోగిస్తారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా దేశీయంగా సౌర పరికరాల తయారీని ప్రోత్సహించనున్నారు. తద్వారా వీటి కోసం చైనా వంటి దేశాల పై ఆధారపడటం తగ్గుతుందని కేంద్రం భావిస్తోంది. మరో వైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంగళవారం జరిగిన ఏపీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం లో టాటా పవర్ ప్రాజెక్టుకు అనుమతి లభించింది. వచ్చే కేబినెట్ సమావేశంలో దీనికి మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు ద్వారా 1,000 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు మంగళవారం జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో 14 సంస్థలకు చెందిన రూ.19,391 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కడప జిల్లాలో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ రూ.5,571 కోట్ల పెట్టుబడికి ఆమోదం లభించింది. ప్రాజెక్టు ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. అలాగే నంద్యాల జిల్లాలో రామ్‌కో సిమెంట్స్ 1,500 కోట్ల రూపాయల పెట్టుబడికి ఆమోదం లభించింది. దీని ద్వారా 300 మందికి ఉపాధి లభించనుంది. వీటితో పాటుగా వివిధ జిల్లాలలో పలు కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వచ్చే మంత్రివర్గ సమావేశంలో వీటికి ఆమోదం తెలపనున్నారు.

## పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పరిశీలించిన సీఎం..

మొదటి పేజీ తరువాయి
ఘన స్వాగతం పలికారు. ముందుగా ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుండి పోలవరం ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వర రావు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీషదేవి, డా. కామినేని శ్రీనివాస్ తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జలవనరుల శాఖా మంత్రి డా. నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ సూపెరింటెండెండింగ్ ఇంజనీర్ రెడ్డి రామచంద్రరావు, తదితరులు ముఖ్యమంత్రికి ప్రాజెక్ట్ పనుల ప్రగతిని ముఖ్యమంత్రి కి వివరించారు. అనంతరం అప్పర్ కాఫర్ డాం చేరుకొని, అక్కడ పనుల పురోగతి పై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి, వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్యాప్ 1, గ్యాప్ 2, ఈసిఆర్ఎఫ్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్, కుడి ప్రధాన కాలువ కనెక్టువిటీస్ చేరుకొని అక్కడ పనుల పురోగతి పై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ లను పరిశీలించి, వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైబ్రో కంప్యాక్షన్ చేరుకొని అక్కడ పనుల పురోగతి పై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి, వివరాలను ఇంజనీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. సిఎం వెంట జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, రాష్ట్ర మంత్రులు డా. నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, శాసనసభ్యులు చిర్రి బాలరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), మద్దిపాటి వెంకటరాజు, పత్సమట్ల ధర్మరాజు, డా. కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్ కుమార్, పితాని సత్యనారాయణ, ఏలూరు రేంజి ఐజి జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ., ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఏపీ ఏఎస్ సిపిసి చైర్మన్ పీతల సుజాత, ఏపి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ సిబ్బంది, ప్రభృతులు ఉన్నారు.

## వెనిజులా చమురు నౌకను సీజ్ చేసిన అమెరికా..

మొదటి పేజీ తరువాయి
రష్యా జెండా ఉన్న ఈ నౌక నార్త్ అట్లాంటిక్ సముద్రం గుండా ప్రయాణిస్తున్న క్రమంలో నౌక పై దాదాపు 2 వారాలుగా అమెరికా సైన్యం నిఘా పెట్టింది. ఆ నౌకలో రష్యా సైన్యం ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో అమెరికా ఆ నౌకను తమ అధీనం లోకి తీసుకుంది. ఇదే విషయాన్ని యూఎస్ మిలిటరీస్ యూరోపియన్ కమాండ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. అమెరికా రక్షణ దళానికి చెందిన జస్టిస్ డిపార్ట్ మెంట్ ఈ నౌకను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఈ నౌకకు మొదటగా బెల్లా 1 అనే పేరు పెట్టారు. వెనిజులా లోని ఆయిల్ కంపెనీలకు చెందిన నౌక ఇది. అయితే ఈ నౌకను అమెరికా నిషేధించింది. నౌకను స్వాధీనం చేసుకునేందుకు అమెరికన్ కోస్టు గార్డు ప్రయత్నించగా వారి నుంచి తప్పించుకున్న నౌక ఇంటర్నేషనల్ వాటర్ లో ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో నౌక పేరును మరినెరా గా మార్చారు. రష్యన్ సంస్థ నుంచి రిజిస్ట్రేషన్ పొంది, ఆ దేశ జెండాతో ప్రయాణం సాగించింది. అయితే తాజాగా ఈ నౌకను అమెరికా సైన్యం అధీనం లోకి తీసుకోవడంతో రష్యా-అమెరికా మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరో వైపు రష్యాకు వెనిజులాతో మంచి సంబంధాలు ఉన్నాయి. రష్యా- వెనిజులా మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత బలోపేతం అయ్యాయి. అలాగే వెనిజులా పై అమెరికా విధిస్తున్న ఆంక్షల్ని రష్యా తప్పుబడుతూ వస్తోంది. ఈ క్రమంలో రష్యన్ ఫ్లాగ్ ఉన్న చమురు నౌకను అమెరికా ఆధీనంలోకి తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే విషయం పై రష్యా స్పందించాల్సి ఉంది.

# పోలవరంతో పాటు చింతలపూడి పనులు కూడా వేగవంతం చేస్తాం ఎంపీ పుట్టా

- పోలవరం పనులు 2027 జూన్ కి పూర్తి.
- చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు త్వరలో ప్రారంభం.
- నేవీ ఆయుధ డిపో కొయ్యలగూడెంకి మార్పు
- ముఖ్యమంత్రి పోలవరం పర్యటనలో ఏలూరు ఎంపీ

**ఏలూరు, పెన్ సత్తా, జనవరి 07:** పోలవరం ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లో 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టు కంపెనీని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం ముఖ్యమంత్రితో పాటు పోలవరం ప్రాజెక్టు సందర్శనలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. పర్యటన ఆసాంతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు నడుస్తూ పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టు పనులను 2027 జూన్ నాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టు కంపెనీ హామీ ఇచ్చిందన్నారు. కుడి, ఎడమ కాలువల కనెక్టివిటీ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఈ సందర్భంగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను కూడా త్వరలో ప్రారంభించాలని మేఘా ఇంజనీరింగ్ సంస్థను ముఖ్యమంత్రి ఆదేశించారని ఎంపీ తెలిపారు. అదేవిధంగా



నేవీ ఆయుధ డిపో ఏర్పాటు కోసం కొయ్యలగూడెం వద్ద స్థల సేకరణ కోసం త్వరలో ప్రజాభిప్రాయసేకరణ చేపడుతున్నట్లు స్పష్టం చేసిన ఎంపీ, ముఖ్యమంత్రి ఇస్తున్న ప్రాధాన్యతతో ఏలూరు జిల్లాకు అన్నీ మంచి రోజులు రానున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.

# నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

- బాధితులకు తక్షణ న్యాయం అందించడమే లక్ష్యం.
- గంజాయి, నాటు సారా అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపాలి.

**నర్సీపట్నం, పెన్ సత్తా, జనవరి 07:** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అధికారులకు సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల సానుకూలంగా స్పందించాలి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, నిరుపేదల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి వారికి భరోసా కల్పించాలన్నారు. పట్టణం లోని క్రైమ్-ప్రోన్ (నేరాలు జరిగే అవకాశం ఉన్న) ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షించాలి. సాంకేతిక లోపాలు ఉన్న కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేయించాలి. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిరంతర నిఘా ద్వారా ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టాలి. పట్టణంలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచడం ద్వారా నేరాలను అదుపు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలి.

సీసీటీఎన్ఎస్ లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికల పై ప్రత్యేక నిఘా ఉంచాలి. పోలీస్ స్టేషన్ సిబ్బంది క్రమశిక్షణతో, సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో మర్యాద పూర్వక మైన సంబంధాలు కలిగి ఉండాలని, అత్యవసర సమయాల్లో స్పందించే వేగం మెరుగుపరుచు కోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో నర్సీపట్నం టౌన్ ఇన్స్పెక్టర్ గఫూర్, ఎస్సైలు ఉమామహేశ్వర రావు, రమేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.







# హంస వాహనం పై హరి నారాయణుడు





**నక్కపల్లి, పెన్ సత్తా, జనవరి 07:** ప్రాచీన పుణ్యక్షేత్రం ఒక మాట వెంకటేశ్వర స్వామి హంస వాహనంపై బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తం గా వెలసిన శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస అధ్యయన ఉత్సవములు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం ఆలయ అర్చకలు కొండపై గల మూల విరాట్ కు కొండ దిగువున ఉన్న వేణుగోపాల స్వామి ఉత్సవ మూర్తులకు నిత్య పూజా కార్యక్రమములు నిర్వహించిన తర్వాత స్వామివారి ఉత్సవమూర్తులను హంస వాహనం పైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలోనూ అధిష్టింప చేసి ఉపమాక మాడ వీదుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. తరువాత గోదాదేవి అమ్మవారి సన్నిధిలో విశేష ప్రసాద నివేదనల తీర్థ గోష్టి,భక్తులు అందరికీ ప్రసాద వినియోగము నిర్వహించారు. రాపత్తు అధ్యయన ఉత్సవములలో భాగంగా సాయంత్రం స్వామి వారి తిరువీధి సేవలు యధా విధిగా జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదచార్యులు తెలిపారు. తర్వాత ప్రసాద నివేదనలు, తీర్థ గోష్టి భక్తులందరికీ ప్రసాద వినియోగము నిర్వహించారు.భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన మై ఫ్రెండ్స్ టీం

**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 07:** మాట్లాడే పెదవులు కన్నా..సాయం చేసే చేతులు మిన్న అనే సిద్ధాంతం తో ఏర్పడిన మై ఫ్రెండ్స్ టీం ద్వారా సంక్రాంతి వేడుకలను దృష్టిలో పెట్టుకొని గవర పాలెం పార్క్ సెంటర్ వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమాన్ని దాడి రవికుమార్, ఆడారి నాగేశ్వర రావు, బుద్ద రాజు, పోలమరశెట్టి చందు అడవీర్యంలో నిర్వహించారు. ప్రతి నాలుగు నెలల కొకసారి ఒక మంచి కార్యక్రమం మై ఫ్రెండ్స్ టీం ద్వారా చేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా టీం కి అన్నివిధాల సహకరించే మిత్రుడు దాడి రవి కుమార్ పుట్టినరోజు సందర్భంగా టీం సభ్యులు అందరూ రవి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుద్ద రమణాజీ, కర్రి శివుడు, కె . యన్.వీ. సత్య నారాయణ, పీ.వి.జగన్ మోహన్ రావు, పెంటకోట సత్యనారాయణ, మల్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



# ట్రంప్ మెడ పై అభిశంసన కత్తి- శరవేగంగా మారుతున్న పరిణామాలు?



**అమెరికా పెన్ సత్తా, జనవరి 07:** : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు పదవీ భయం పట్టుకుంది. ఈ ఏడాది నవంబర్ లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ గెలవకపోతే తాను అభిశంసనకు గురి అవుతానని భావిస్తున్నారు. ఇదే విషయాన్ని రిపబ్లికన్లతో నిర్వహించిన సమావేశం లోనూ స్పష్టం చేశారు. మిడ్ టర్మ్ ఎన్నికల్లో గెలవకపోతే తన అభిశంసన తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్, యూఎస్ కాంగ్రెస్ కు జరిగే ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా మెజారిటీ స్థానాలను దక్కించుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. వాషింగ్టన్‌లో జరిగిన హౌస్ రిపబ్లికన్ ఎంపీల రిట్రీట్ కార్యక్రమంలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. నవంబర్ లో జరగబోయే మధ్యంతర ఎన్నికల్లో తప్పక గెలవాలని, అలా జరక్కపోతే డెమోక్రాట్లు ఏదో ఒక కారణాన్ని వెదికి తనను అభిశంసిస్తారని తేల్చి చెప్పారు. యూస్ కాంగ్రెస్ పై రిపబ్లికన్ల పట్టు బలహీనపడకూడదని, ఈ అవకాశం కోసమే డెమోక్రాట్లు ఎదురు చూస్తోన్నారని పేర్కొన్నారు. మిడ్ టర్మ్ ఎన్నికల్లో గెలవకపోతే కొన్ని అజెండాలు అర్థాంతరంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. డెమోక్రాట్లకు కాంగ్రెస్‌లో ఆధిక్యం దక్కితే, తనను అభిశంసన ప్రక్రియను ప్రారంభించే అధికారం వారికి లభిస్తుందని కుండబద్దలు కొట్టారు ట్రంప్. ఈ నవంబర్ లో యూఎస్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో మొత్తం 435 సీట్లకు, సెనేట్‌లో 100లో మూడింట ఒక వంతు సీట్లకు వచ్చే నవంబర్ లో పోలింగ్ జరగనుంది. హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్, కాంగ్రెస్ పై పట్టు నిలుపుకోవడం పార్టీకి అత్యంత ముఖ్యమని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రస్తుతం- హౌస్ లో రిపబ్లికన్లకు ఉన్న మెజారిటీ స్వల్పమే. అమెరికా చట్టం ప్రకారం దేశద్రోహం, లంచం, లేదా ఇతర తీవ్రమైన నేరాలు, దుష్ప్రవర్తన వంటి ఆరోపణల పై అధ్యక్షుడిని అభిశంసించే సర్వాధికారాలు హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్ కు ఉంది. మూడింట రెండు వంతుల ఓట్లతో ఆయన్ను దోషిగా నిర్ధారించి, పదవి నుంచి తొలగించవచ్చు. నవంబర్‌లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలు, సెనేట్‌లోని 33 స్థానాలకు పోలింగ్ జరగనుంది.జనాభా ఆధారంగా విభజించిన నియోజకవర్గాల నుండి సభ్యులు హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్ కు ఎన్నికవుతారు. సెనేటర్లు రాష్ట్రవ్యాప్త ఎన్నికల ద్వారా ఎంపికవుతారు. రిపబ్లికన్లకు అనుకూలమైన కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ మ్యాప్‌లను ఆమోదించాలని ట్రంప్, రిపబ్లికన్ పాలిత రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోన్నారు. దీన్ని గెరిమాండరింగ్ అంటారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. క్సాస్, మిస్సోరి, నార్త్ కరోలినా వంటి రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి పునర్విభజనలు చేశాయి కూడా.

# అక్రమ లింగ నిర్ధారణ పై ఉక్కుపాదం

- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్
- పిసిపిఎన్డిటి చట్టం అమలులో ఏ మాత్రం సడలింపు లేదు





**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 07:** జిల్లాలో లింగ వివక్షను పూర్తిగా నివారించి బాలికల సంరక్షణకు చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పిసిపిఎన్డిటి (ప్రి-కాన్సెప్షన్ & ప్రి-నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్) చట్టం అమలు పై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భంలో ఉన్న శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారి పై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు, నర్సింగ్ హోంలు, డయాగ్నస్టిక్ సెంటర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా అల్ట్రాసౌండ్ యంత్రాల వినియోగం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, పిసిపిఎన్డిటి చట్ట ఉల్లంఘనలు చోటుచేసుకుంటే సంబంధిత కేంద్రాల పై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అన్ని స్కానింగ్ సెంటర్లలో ఉన్న పరికరాల వివరాలు, రోజువారీగా కేంద్రాలను సందర్శించే రోగుల వివరాలతో కూడిన సరైన రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, బాలికల విలువను తెలియజేసే కార్యక్రమాలను ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాలని తెలిపారు. పిసిపిఎన్డిటి చట్టం సమర్థవంతంగా అమలైతే జిల్లాలో లింగ నిష్పత్తి మెరుగుపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సూర్యలక్ష్మి, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కల్సిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..

● వేట విరామ సమయంలో ఉన్న అగ్నికుల క్షత్రియులకు జీవనభృతి పై విజ్ఞప్తి.



**కొత్తపేట, పెన్ సత్తా, జనవరి 07:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుధవారం సీఎం పేషీ లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలుసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాల పై సీఎంకు ఎమ్మెల్యే విన్నవించారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న అగ్నికుల క్షత్రియులకు వేట విరామ సమయంలో ఓఎన్జీసీ, గెయిల్, రిలయన్స్ తదితర సంస్థల నుంచి జీవనభృతి అందే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. రావులపాలెంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ మంజూరు, ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి నిధుల మంజూరు, దళిత పారిశ్రామిక వేత్తలకు ఎమ్ ఎస్ ఎమ్ ఈ ల ప్రోత్సాహక రాయితీలు విడుదల చేయవలసిందగా చేయాలని కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ కై నియోజకవర్గంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అందజేశారు. ఆయా అంశాల పై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే బండారు తెలిపారు.

## మన పల్లెకు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో పంచకర్ల








**సబ్బవరం, పెన్ సత్తా, జనవరి 07:** పెందుర్తి నియోజకవర్గం, సబ్బవరం మండలం మేజర్ పంచాయతీ, సబ్బవరం గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహించిన, మన పల్లెకు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. బుధవారం సబ్బవరం గ్రామంలో సీతారామ కళ్యాణ మండపంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహించిన మన పల్లెకు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుండి వినతులను స్వీకరించిన జనసేన పంచకర్ల రమేష్ బాబు. ఈ కార్యక్రమంలో భాగంగా సబ్బవరం మేజర్ పంచాయితీలో భాగమైన చెన్నయ్య పాలెం గ్రామంలో సుమారు 30 లక్షల రూపాయలతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం 1,2,3,4 ప్రజలు నుండి వ్యక్తిగతంగా ఇచ్చిన అర్జీలను తీసుకొని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పరిష్కారం మార్గాలను కనుగొనుటకు వెంటనే అధికారులకు ఆదేశించడం జరిగినది. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైన్లు, స్మశాన వాటికలు చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి గ్రామీణ ఉపాధి హామీ నిధులు కేటాయిస్తామని, సబ్బవరం లో మురుగు నీటిపారుదల సమస్య అధికంగా ఉన్నందున ప్రధాన రహదారికి రెండు పక్కల సీసీ డ్రైన్లు నిర్మిస్తామని ఈ క్రమంలో ఆక్రమణలు తొలగించి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు. సర్వే నెంబర్ 271 లో విద్యుత్ మీటర్ల కేటాయింపు పై జరుగుతున్న అన్యాయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆ సమస్య కోర్టులో ఉందని జిల్లా కలెక్టర్ తో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని స్థానిక నాయకులు కోరగా ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా ఆక్రమణ తొలగించి గోడ నిర్మించి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆదిరెడ్డి పాలెం, పెద నాయుడుపాలెం, గొర్ల వానిపాలెం,చిన్న గొల్లలపాలనానికి సంబంధించి పలు రకాల సమస్యలను కూటమినేతలు ఎమ్మెల్యే పంచకర్ల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారి పద్మజ, మండల రెవెన్యూ డిప్యూటీ తాసిల్దార్ అప్పారావు, మండలం ఇంజనీరింగ్ శాఖ అధికారులు, మండలం ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీటీసీ చొక్కాకుల గోవింద్,మండల పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు, గొంపా నర్సింగ్ రావు, సీనియర్ నాయకులు సాలాపు వెంకటేశ్వర రావు, ఇందల రమణ, ఎంపీటీసీలు బయలుపూడి దేవుడి బాబు, గొర్లు చైతన్య, బల్రెడ్డి అప్పారావు, కోరాడ శ్రీనువాసు,తాటిపాముల శేఖర్ (వార్డ్ నెంబర్), బర్ల రమణ, పల్లి మంగరాజు,చింతల శ్రీనివాసరావు, సచివాలయం-2 కోటాన అప్పారావు, పల్ల .తాతారావు గారు(కోపరేట్ బ్యాంక్ డైరెక్ట్) , రోమాల. చంద్రశేఖర్, మొదలగు సబ్బవరం మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జానయ్య పేట హై స్కూల్ సందర్శించిన ఎంపీడీవో





**నక్కపల్లి, పెన్ సత్తా, జనవరి 07:** మండలంలో జానకయ్య పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో బి. చైతన్య బుధవారం సందర్శించారు. పదవ తరగతి పరీక్షలలో 100 రోజుల ప్రణాళిక నిర్వహణపై ఆరా తీశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పాఠశాలలో జరుగుతున్న వందరోజుల యాక్షన్ ప్లాన్ గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ పట్టుదలతో ఇష్టంగా చదివి చక్కని మార్కులతో ఉత్తీర్ణత కావాలని విద్యార్థులకు సూచించారు. అందుకు తగ్గట్టుగా విద్యార్థులందరూ ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులతో పాస్ కావాలని తెలిపారు. పాఠశాలలో వంద రోజులు యాక్షన్ ప్లాన్ జరిగే విధానం గురించి ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ పక్కా గా అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదవ తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో జీఎస్టీ రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి.





● జిల్లాలో అన్ని వ్యాపార సంస్థలను జీఎస్టీ పరిధిలోకి తేవాలి.
● జీఎస్టీ సమన్వయ కమిటీ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 07;** జిల్లాలో కొన్ని వ్యాపార సంస్థలు తమ కార్యకలాపా లు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చట్టం కింద నమోదు చేసుకోవాల్సి ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా పన్ను వలయానికి వెలుపల ఉన్నాయని, వారిని వస్తు పన్నుల జీఎస్టీ పరిధి లోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేసారు. ఇటీవల రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ ఎ. బాబు సూచనల మేరకు వస్తూ సేవల పన్ను (జీఎస్టీ ) రెవెన్యూ వసూళ్ల మరింత ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశాఖపట్నం డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ ఉప కమిషనర్ వి. కేదారేశ్వర రావు తో కలిసి జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వస్తు సేవల పన్ను (జీఎస్టీ ) రెవెన్యూ వసూళ్ళు మరింత ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. జీఎస్టీ పరిధి వలయానికి వెలుపల ఉన్న వారిని పన్నుల పరిధిలోకి తీసుకురావడానికి వీలుగా జిల్లా పరిశ్రమల శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు, అటువంటి వర్తకులు సమాచారాన్ని వాణిజ్య పన్నుల శాఖకు తక్షణమే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు, పాతబకాయిదారు లను తక్షణమే గుర్తించాలని, జిల్లాలో వస్తు సేవల పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, బకాయిదారుల ఆస్తులను గుర్తించడంలో జీఎస్టీ అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులకు, లీడ్ బ్యాంక్ తో పాటు ఇతర బ్యాంకు అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. జీఎస్టీ అధికారుల నుంచి జారీ చేసే నోటీసుల్లో బకాయిదారులకు సంబంధించి ఖాతా వివరాలు, వారి ఖాతాలను స్తంభింపజేయడం తదితర అంశాల ఆవశ్యకతను సమన్వయకమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అధికారులకు వివరించారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల అధికారులకు బకాయిదారులకు సంబంధించి ఆస్తుల వివరాలు, బిల్డర్లకు సంబంధించి కొత్త రిజిస్ట్రేషన్ వివరాలను జీఎస్టీ అధికారులకు అందించాలని కలెక్టర్ స్పష్టంచేసారు. మైనింగ్ అక్రమ రవాణాను నిరోధించే చర్యల్లో భాగంగా మైనింగ్ అధికారులు, రవాణా శాఖా అధికారులు వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయం చేసుకొని పనిచేయాలని కలెక్టర్ స్పష్టంచేసారు. స్థానికంగా వస్తు వినియోగం, సేవల వినియోగానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని, ఈమేరకు ఇంజినీరింగ్ విభాగాలు కాంట్రాక్టర్లను స్థానికంగా లభించే డీజిల్ ఇతర నిర్మాణ సామాగ్రి వాడకాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. జీఎస్టీ చట్టపరిధి లోకి వచ్చే కాంట్రాక్ట్ సేవలు, ఇతర పన్నులు చెల్లించదగిన సేవలకు సంబంధించి మూలంలోనే పన్నులు వసూలు చేసేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డీడీఓ లను జిల్లా కలెక్టర్ ఆదేశిస్తూ ఆమేరకు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్, ఇంజినీరింగ్, ఇరిగేషన్, గృహనిర్మాణ శాఖ తదితర డీడీఓ లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు. వృత్తి పన్ను వసూల్లకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, టెక్నికల్ ఎడ్యుకేషన్, మున్సిపల్ అధికారులు తదితర శాఖల అధికారులకు ఆదేశాలు ఇస్తూ వాణిజ్య పన్నుల శాఖకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ వృత్తిపన్ను వసూళు ,, పెంపుదలలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ స్పష్టంచేసారు. ఈ అంశాలకు సంబంధించి పన్ను వసూళ్లలో మరింత ప్రగతి, పురోగతి సాధించేందుకు ప్రతి నెలా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే జిల్లా అధికారుల సమీక్షా సమావేశంలో మొదటి ప్రాధాన్యత అంశంగా పన్ను వసూళ్లకు సంబంధించి సమీక్షిస్తానని కలెక్టర్ జిల్లా అధికారులకు స్పష్టంచేసారు. ఈ సమావేశంలో విశాఖ డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ టి శ్రీనివాస్రావు, అనకాపల్లి, అచ్యుతా పురం సహాయ కమీషనర్లు పి కృష్ణ రావు, సింధు ప్రియ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుదీర, జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి మన్మధరావు, జిల్లా భూగర్భ గనులు శాఖ అధికారి ఎం. శ్రీనివాస్, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె మనోరమ, లీడ్ బ్యాంకు మేనేజర్ కె సత్యన్నారాయణ, ఎంపీడీఓలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి.

● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, జనవరి 07;** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడిఓసి లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు లఘు చిత్రాలను రూపొందించి సినిమా థియేటర్లలో ప్రదర్శించాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు, వాహనదారులకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా రహదారులపై ఉన్న గుంతలను వెంటనే గుర్తించి పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై గుంతలను పూడ్చే బాధ్యత సంబంధిత ప్రతి శాఖకూ ఉందని అన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఇందుకు అనుగుణంగా బ్లాక్ స్పాట్ల మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.కొత్తగూడెం పట్టణంలో రైల్వే స్టేషన్ పరిసరాలు లక్ష్మదేవిపల్లి మోర్ సూపర్ మార్కెట్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే కొత్తగూడెం పట్టణంలోని ఫుట్‌పాత్‌ల వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారులను అనువైన ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తగిన స్థలాన్ని గుర్తించాలని అన్నారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను మరమ్మత్తులు చేసి సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్ట ప్రకారం జైలు శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

## ఆత్మకూర్ (ఎం) మండలంలో ఆలేరు నియోజకవర్గ స్థాయి క్రీడోత్సవాలు



**ఆత్మకూర్ యం పెన్ సత్తా, జనవరి 07;** ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు బాల బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ సాయుధ పోరాట నాయకులు డా. ఆరుట్ల కమలాదేవి - రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ స్థాయి ఆరుట్ల దంపతుల స్మారక క్రీడోత్సవాలు ప్రారంభించిన భువనగిరి ఎంపీ శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్పర్సన్ బండ్రు శోభారాణి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నర్సింలు,ఆత్మకూర్ ఎం సర్పంచ్ ధనలక్ష్మ చందర్ గౌడ్ ఆరుట్ల శుశీల దేవి, శ్రీకాంత్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి, , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత దంత వైద్య శిబిరం



**దఆత్మకూర్ పెన్ సత్తా, జనవరి 07;** ఆత్మకూర్ (యం)మండలం సిద్దాపురం గ్రామంలో గత నాలుగు రోజుల నుండి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆత్మకూర్(యం)వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ గుమ్మి.ఉజ్వల రెడ్డి నాలుగు రోజుల నుండి, ఏనుగు సత్యనారాయణ రెడ్డి ఫామ్ హౌస్ లో సుమారుగా 120 మందికి ఉచిత దంత వైద్యం అందించారు.వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజన సదుపాయం కూడా కల్పించారు.

## తిరుమలాపురంలో ర్యాలీ వైద్య శిబిరం

- ఇంకుడు గుంటలు పూల్చడం
- జాతీయ సేవా పథకం






**చింతకాని ప్రతినిధి. పెన్ సత్తా, జనవరి 07;** కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగులవంచ ఆధ్వర్యంలో తిరుమల పురంలో గ్రామ సర్పంచ్ చేపలమడుగు వీరబాబు , మరియు ఎన్ ఎస్ ఎస్ పి ఓ జి మల్లయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది, ప్రధాన అంశాలుగా ప్లాస్టిక్ నివారించాలని, ఇంటింటికి మొక్కలు నాటాలని, బాల్యవివాహాలను నిషేధించాలని, యువత డ్రగ్స్ గంజాయి బారిన పడకూడదని నినాదాలతో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోగుల నాగమణి వార్డ్ మెంబర్లు బండి అరుణ ఐతం విజయ యూపీఎస్ మాథ్స్ ఉపాధ్యాయులు ప్రీతం పాల్గొన్నారు

క్యాంపులో వైద్య శిబిరం

మధ్యాహ్నం డాక్టర్ హలీం సిపి ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ముందుగా విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ హెచ్ హేమలత జి ఎన్ ఎమ్,

డాక్టర్ శివ జనావాని ప్రాజెక్టు డైరెక్టర్, సోహెల్ డేటా మేనేజర్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అధ్యాపకులు రాంబాబు వేణుగోపాల్ పద్మావతి యశోద సాయి చరణ్ సూరారెడ్డి కొండలు పాల్గొన్నారు

శ్రమదానం ఇంకుడు గుంటలు కూర్చడం

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామంలో చెత్త తొలగించడం కాల్వల శుభ్రపరచడం మరియు నిన్న తీసిన ఇంకుడు గుంటలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా గులకరాళ్ళను సేకరించి ఇంకుడు గుంటలను పోర్చుటం జరిగింది

# ఆరుట్ల దంపతుల స్మారక క్రీడోత్సవాలను ప్రారంభించిన భువనగిరి ఎంపీ శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు ...

**ఆలేరు పెన్ సత్తా, జనవరి 07;** డా. ఆరుట్ల కమలాదేవి ఉ రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఉన్నత పాఠశాలల బాలబాలికల ఆరుట్ల దంపతుల స్మారక క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి...

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు హాజరై జెండా ఊపి క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్‌లో గౌరవ వందనం స్వీకరించారు...

ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ, తెలంగాణ ముద్దుబిడ్డలైన ఆరుట్ల రామచంద్రారెడ్డి ఉ డా. కమలాదేవి దంపతుల పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ స్మారక క్రీడోత్సవాల ద్వారా బాలబాలికల్లో క్రీడాస్ఫూర్తి, సంఘటిత శక్తి, వ్యూహాత్మక నైపుణ్యాలు పెంపొందిస్తూ విజయాల బాట చూపుతున్న నిర్వహణ కమిటీని అభినందించారు. ఈ మట్టిలోంచే మాణిక్యాల వంటి ప్రతిభావంతులు వెలిసేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. ఆరుట్ల దంపతుల ఆశయాల బాటలో ముందుకు సాగుతూ, వారి కలలను సాకారం చేసే దిశగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఈ స్మారక క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు...

ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు: శ్రీ కొత్త మహదేవ్ రెడ్డి గారు,
+ఎవీ ్గానూ ఆత్మకూర్ (యం) కన్వీనర్, ఆరుట్ల స్మారక క్రీడోత్సవాలు.
తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండ్రు శోభారాణి గారు, మాజీ మంత్రి శ్రీ మోత్కుపల్లి నర్సింహులు గారు,
శ్రీ కందుల సత్యనారాయణ గారు ఉ జిల్లా విద్యాశాఖాధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా,
శ్రీ పల్లా వెంకటరెడ్డి గారు ఉ మాజీ శాసనసభ్యులు– మునుగోడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
శ్రీ యానాల దామోదర్ రెడ్డి గారు ఉ సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు, ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మ గారు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...



## గ్రామ సమస్యల పై పట్టు బిగించిన, సర్పంచ్ స్రవంతి



**జనవరి 07 పెన్ సత్తా, జనవరి 07;** చేగుంట / చేగుంట పట్టణ కేంద్రం లోని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫిక్, వార్డ్ మెంబర్ లు గ్రామ సమస్యలు చెప్పిన వెంటనే స్పందించి, సమస్యలను తెలుసుకొని సానుకూలంగా స్పందిస్తున్నారు. అందులో భాగంగానే చేగుంట నుండి మెదక్ వెళ్లే రోడ్ మార్గం లో రోడ్ కి ఒక ప్రక్కన వర్షం ప్రవాహానికి గుంటలుగా ఏర్పడి దాని వలన వారంలో ఒకరు లేదా ఇద్దరు ప్రయాణికులు రోడ్ మీదికి వాహనాలను ఎక్కించే క్రమంలో జారి కింద పడుతున్నారని తెలుపగానే వెంటనే సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు స్పందించి ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించినారు. ఘటన స్థలంలో మట్టి పోయడానికి,తాత్కాలిక పరిష్కారానికి సానుకూలంగా స్పందించినారు. అనంతరం చేగుంట లోని వ్యవసాయం మార్కెట్ కమిటీ బిల్డింగ్ పనులను పర్యవేక్షంచినారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీక్, వార్డ్ మెంబర్లు కట్ట శివలక్ష్మ శ్రీనివాస్, మిట్టపల్లి ఎల్లేష్, కటికే రవి, ఆకుల సుఖేందర్ లు, గ్రామస్తులు రామానుజన్, సతీష్, సత్యం, సాయి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఓటర్ జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని
- మున్సిపల్ ఓటర్ జాబితా తదితర అంశాలపై ఎన్నికల సంఘం కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ఖమ్మం, పెన్ సత్తా, జనవరి 07;** మున్సిపల్ ఓటర్ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని అన్నారు.

మున్సిపల్ ఓటర్ జాబితా తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లు, అధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షంచగా, ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ జిల్లాల వారీగా ఓటరు జాబితాలపై వచ్చిన అభ్యంతరాల వివరాలను సమీక్షంచి మాట్లాడుతూ, ఈ నెల 12 వ తేదీ నాడు వార్డుల వారిగా ఫోటో ఎలక్టరోల్స్ జాబితా ప్రచురించడంతో పాటు, 13వ తేదీన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలను ప్రచురిస్తామని తెలిపారు. 16వ తేదీన తుది పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించి, పోలింగ్ కేంద్రాల వారీగా ఫోటో ఎలక్టరోల్స్ ప్రచురిస్తామని వెల్లడించారు. అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు.

2025 సంవత్సరం సంబంధించి 3వ సప్లిమెంటరీ ఓటరు జాబితా నవంబర్ 15వ తేదీన విడుదలైందని, దాని ప్రకారం పట్టణాలలో వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా జనవరి 1వ తేదీన విడుదల చేశామని తెలిపారు. అవసరమున్న అన్నిచోట్లా వెబ్ కాస్టింగ్ కు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ జాబితా లపై 192 అభ్యంతరాలు రాగా, ఇప్పటికి 129 అభ్యంతరాలను పరిష్కరించినట్లు, మిగులు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించ నున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఉన్న సిబ్బంది డాటాను మునిసిపల్ ఎన్నికల లోను తీసుకోనున్నట్లు అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, మున్సిపల్ కమీషనర్లు శ్రీనివాస రెడ్డి, సంపత్, నర్సింహా, రామచందర్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐశ్వర్య గారి దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన -బక్క హేమ్లతండా సర్పంచ్ గుగులోత్ క్రిష్ణ నాయక్



**భద్రాది కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, జనవరి 07;** జూలూరుపాడు మండల పిక్ల నాయక్తండా చెందిన గుగులోత్ శ్రీను ఈజ్జి గారి కుమార్తె ఐశ్వర్య గారి మృతి చెందడంతో వారి పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండలం, బక్క హేమ్లతండా గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ క్రిష్ణ నాయక్ గారు

ఈ కార్యక్రమంలో మూడ్ రవీందర్ నాయక్, మూడ్ చందు నాయక్, మూడ్ శంకర్ నాయక్, మూడ్ సీతారాం నాయక్, మూడ్ వీరన్న నాయక్, మూడ్ బాలు నాయక్, మూడ్ రవి నాయక్, జాటోత్ వీరన్న నాయక్, మూడ్ మోహన్ నాయక్, పత్తులోత్ మోహన్ నాయక్, పత్తులోత్ నరేష్, శ్రీకాంత్, రాజు, కళ్యాణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలి చేసిన సర్పంచ్ పర్చ రామచంద్రరావు



**చింతకాని పెన్ సత్తా, జనవరి 07; ప్రతినిధి:**చింతకాని మండలం చిన్నమండవ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ పర్చ రామచంద్రరావు మరియు పంచాయతీ పాలకవర్గంతో ఆకస్మికంగా తనిఖీలు చేశారు.. సర్పంచ్ రామచంద్రరావు గారు విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు, విద్యార్థులకు ప్రశ్నలు వేస్తూ వారి వద్ద నుంచి సమాధానం రాబట్టారు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత మరియు ఉపాధ్యాయులు కిషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ పర్చ రామచంద్రరావు ఉప సర్పంచ్ తంగిరాల మాధవి గారిని శాలువతో ఘనంగా సన్మానించారు .. కార్యక్రమంలో గుండ్ల బేబీ రాణి, సోంపోగు రమణమ్మ, గుండ్ల అనిల్ కుమార్, గుండ్ల భద్రమ్మ, కాశీ మాల కిరణ్ కుమార్,కాశీమాల సరిత, పర్చగాని వెంకటరాములు స్కావెంజర్ మోదుగు పుల్లమ్మ పాల్గొన్నారు...

# వైసీపీలో అమలాపురం ఫైట్

**కాకినాడ, జనవరి 7,**
సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో మేమున్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబంధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకునేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. ఇదే తీరు అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా




దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కవ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది.. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమాలకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాధ్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవడంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు.. ఇక తప్పక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ పిలుస్తున్నప్పుడు వెళ్లి హాజరవుతున్నట్లు తెలుస్తోంది.. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకు కొందరు వైసీపీ నాయకులు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజకవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

# కొత్త లుక్ లో జనసేనాని...

**విజయవాడ, జనవరి 7, :**
పొలిటికల్ ట్రెండ్ సెట్టర్ పవన్ కళ్యాణ్. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక స్టార్ డం ఉన్న హీరో. విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే రాజకీయాల్లోకి వచ్చిన పవన్ విజయం కోసం చాలా రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. అయితే ఆయన హావభావాలు, వస్త్రధారణ విభిన్నంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్కో స్టైల్ లో కనిపిస్తున్నారు. అయితే సాధారణంగా రాజకీయ పార్టీల నేతలు దోతి వంటి వాటిలో ఎక్కువగా కనిపిస్తారు. ఖద్దరుదారణ కూడా చేస్తారు కానీ పవన్ కళ్యాణ్ ఇటీవల డిఫరెంట్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాజువల్ డ్రెస్సెస్ తో పాటు కార్పొరేట్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇప్పుడు ఇది అందరిలోనూ ఆశ్చర్యం వేస్తోంది. సహజంగానే సినీ పరిశ్రమ నుంచి రావడంతో ఫుల్ గ్లామర్ పవన్ కళ్యాణ్ ది. అటువంటిది ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కాకుండా.. ఓ కార్పొరేట్ ఉద్యోగి తరహాలో కనిపిస్తున్నారు పవన్.సినిమా రంగంలో అగ్ర కథానాయకుడిగా కొనసాగారు పవన్ కళ్యాణ్. ఆయనది చరిష్మ ఉన్న ముఖం. అయితే అంతటి స్టార్ డం ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేసరికి ఒక సాధారణ రాజకీయ నాయకుడిగా మారిపోయారు. కుర్తాతో ఎక్కువగా కనిపించేవారు. ఆపై మెరిసిన గడ్డంతో, తల జిత్తుతో ఎక్కువగా బయటకు వచ్చేవారు. అయితే ఇటీవల మాత్రం



ఆయన హెయిర్ స్టైల్ లో మార్పు వచ్చింది. క్యాజువల్ ఫ్యాంట్, షర్ట్ లో అఫీషియల్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాబినెట్ సమావేశాలతో పాటు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు అలానే వస్తున్నారు. ఈ న్యూ లుక్ ను ఆయన ఎంత మజా చేస్తున్నారో తెలియదు కానీ.. జనసైనికులు మాత్రం చాలా ఆనందంతో గడుపుతున్నారు.అయితే ప్రజలతో పాటు జనసైనికులు పవన్ కళ్యాణ్ విషయంలో రెండు పద్ధతుల్లో ఫీల్ అవుతుంటారు. ఒకటి అభిమాన కథానాయకుడు, ఆపై ఇష్టమైన నేత. అందుకే పవన్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లినా అదే క్రేజ్. చివరకు మంత్రివర్గ సమావేశాలు అయినప్పుడు, మంత్రులు ప్రత్యేకంగా కలుసుకున్నప్పుడు పవన్ కళ్యాణ్ తో ఫోటోలు దిగేందుకు తోటి మంత్రులు కూడా ఆసక్తి చూపుతుంటారు. అంతలా ఉంటుంది ఆయన చరిష్మ. ఆపై ప్రజల విషయంలో ఆయన వ్యవహార శైలి కూడా అలానే ఉంటుంది. చాలా అంకితభావంతో పనిచేస్తారు. అయితే గత కొంతకాలం కిందట వరకు ఆయన సాధారణ వస్త్రాలతోనే కనిపించేవారు. కానీ ఇటీవల అఫీషియల్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇది జనసైనికులకు ముమ్మాటికి ఇష్టపడే విషయం కూడా. అయితే పవన్ కళ్యాణ్ ఎలా ఉన్నా ప్రత్యర్థులకు నచ్చదు. ఎందుకంటే ఆయన వారి ఓటమిపై అంతలా ప్రభావం చూపారు కాబట్టి. అందుకే ఆయన అదిరేటి డ్రెస్ వేసినా వారికి నచ్చదు. అభిమానులు మాత్రం పవన్ కళ్యాణ్ ను చూసి ఫిదా అవుతున్నారు.

# 30 ఏళ్ల క్రితం... వణికించిన బ్లోఅవుట్

**8 జనవరి 1995..సాయంత్రం 6:50కి ఎగసిపడిన మంటలు**

**కాకినాడ, జనవరి 7, :** కోనసీమ అంటే ప్రకృతి అందాలు..పండుగలు..రకరకాల వంటకాలు మాత్రమే అనుకునే రోజుల్లో జరిగిన అగ్ని ప్రమాదం దేశాన్నే వణికించింది. ఛాచీ+జ గ్యాస్ లీక్ వల్ల ఏర్పడిన పాశర్లపూడి బ్లో ఔట్ కోనసీమ పేరును దేశ వ్యాప్తంగా గుర్తుండిపోయేలా చేసింది. మరో భోపాల్ దుర్ఘటనలా మారుతుందా అనే విశ్లేషణలు, భయాలు వెలువడేలా చేసిన పాశర్లపూడి బ్లో ఔట్ ఘటన కు 30 ఏళ్ళు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో మలికిపురం మండలంలోని ఇరుసమండ గ్రామం వద్ద జరిగిన ఛాచీ+జ గ్యాస్ లీక్ గురించి అందరూ భయపడుతున్నారు. కానీ దీన్ని మించిన అత్యంత ప్రమాదం 30 ఏళ్ల క్రితమే జరిగింది. అమలాపురానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాశర్లపూడి అనే గ్రామంలో ఛాచీ+జ గ్యాస్ డ్రిల్లింగ్ పనులు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా లీకేజ్ ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అందరూ సంక్రాంతి పండుగకు రెడీ అవుతున్న సమయంలో 8 జనవరి 1995 సాయంత్రం 6:50కి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. 19వ నెంబర్ బావి వద్ద జరిగిన బ్లో ఔట్‌తో మొదలైన అగ్ని జ్వాలలు ఏకంగా 65రోజులపాటు కొనసాగి మార్చి 15 నాటికి అదుపులోకి వచ్చాయి. అన్ని రోజులపాటు అగ్ని జ్వాలలు అలా ఎగసిపడుతుండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా దేశం అంతా భయపడింది. ప్రభుత్వం వెంటనే అలెర్ట్ అయి చుట్టుపక్కల ఉన్న 7 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించింది. ఏదో రెండు మూడు రోజుల్లో మళ్ళీ సొంత ఊరికి వచ్చేస్తామనుకున్న ప్రజలు ఏకంగా రెండు నెలల పాటు తమ ఊళ్లకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు ఆ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు కానీ ప్రమాదం సంభవించిన రిగ్ నెంబర్ 19 మొత్తం నాశనం అయిపోయింది. ఆ రోజుల్లోనే దాని విలువ 9.2 కోట్లు. అది కాకుండా చుట్టుప్రక్కల ఉన్న సామాగ్రి మొత్తం కాలిపోయింది. వాటి విలువ మరో 7కోట్లు.ఎంత ట్రై చేసినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అమెరికాలోని హ్యూస్టన్‌కు చెందిన నీల్ ఆడమ్స్ ఫైర్ ఫైటర్స్ సంస్థ ఇంజనీర్లను రప్పించారు. కానీ వారు చేసిన మొదటి ప్రయత్నాలు ఫలించలేదు. తరువాత మంటలను అదుపు చేయడానికి వారు మరో పథకం వేసినా అది మరింత ప్రమాదమంటూ దానికి ఛాచీ+జ అనుమతి ఇవ్వలేదు. చివరకు ఇంటర్‌నేషనల్ వెల్ కంట్రోల్ సంస్థ ఇంజనీర్లు రంగంలోకి దిగి 15 మార్చ్ 1995న మంటలను అదుపులోనికి తీసుకుని రాగలిగారు. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్లో ఔట్‌గా చరిత్రకెక్కింది. ఏకంగా 200మీటర్ల ఎత్తుకు మంటలు ఎగసిపడ్డాయి.అప్పట్లో బ్లో ఔట్ కారణంగా ఎగడిపడుతున్న మంటలు చాలా కిలోమీటర్ల దూరానికి కనపడేవి. వాటిని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు కోనసీమ వచ్చేవారు. ప్రస్తుతం అంతా ఒకే అన్నట్టు కనపడుతున్నా 30 ఏళ్ల తర్వాత కూడా బ్లో ఔట్ అన్న మాట వినగానే భయంతో ఉలిక్కిపడుతుంటారు పాశర్లపూడి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు. తాజాగా మలికిపురం బ్లో ఔట్ ప్రమాదంతో ఆనాటి భయంకర పరిస్థితుల గురించి మరోసారి గుర్తు చేసుకుంటున్నారు అప్పటి తరం వారు.

## టీడీపీ గూటికి సిద్ధా...

**ఒంగోలు, జనవరి 7, :** వైయస్సార్ కాంగ్రెస్(పార్టీకి గుడ్ బై చెప్పారు ఒక మాజీ మంత్రి. అయితే ఏడాది కిందట ఆయన రాజీనామా చేశారు. కానీ ఇంతవరకు ఏ పార్టీలో చేరలేదు. ఇష్టమైన పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. మరో పార్టీలో చేరే ఉద్దేశం లేదు. దీంతో గత ఏడాదికాలంగా ఆయన భగీరథ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చంద్రబాబును కలిశారు. కానీ లోకల్ నాయకత్వం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇప్పుడు స్థానిక నేతలను సముదాయించారు చంద్రబాబు. దీంతో ఆ నేతకు పార్టీలో చేర్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆ మాజీమంత్రి తెలుగుదేశం పార్టీలో చేరుతారని సొంత జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అలానే ఆ పార్టీకి రాజీనామా చేశారు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన తరువాత రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. అలా చేరిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకత్వం ఆయనకు ఒక హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే దర్శి టికెట్. గతంలో అదే నియోజకవర్గంలో నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఆ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు అయితే అయిష్టంగానే ఆ పార్టీలో కొనసాగారు రాఘవరావు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే రాజీనామా ప్రకటించారు. చంద్రబాబుతో ఉన్న తన పాత సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ పార్టీలోకి వస్తానని కోరారు. అయితే స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు ఉండడంతో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.ప్రకాశం జిల్లాలో సీనియర్ మోస్ట్ లీడర్ సిద్దా రాఘవరావు. 1999 నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2007లో చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2014లో దర్శి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచేసరికి తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు రాఘవరావును. ఐదేళ్లపాటు మంత్రి పదవిలో కొనసాగిన ఆయనను 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురయ్యేసరికి రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడికి వెనక్కి తగ్గారు. దర్శి టిక్కెట్ హామీతో ఆ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఓడిపోయేసరికి రాఘవరావుకు స్వేచ్ఛ లభించింది. అందుకే ఇప్పుడు మాతృ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలుగుదేశం పార్టీలోకి రావడం ఖాయమని తెలుస్తోంది. కానీ దర్శికి ఇప్పటికే టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు గొట్టిపాటి లక్ష్మి. మొన్నటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు రాఘవరావు వస్తుండడంతో లక్ష్మి పరిస్థితి ఏంటి అనేది తెలియడం లేదు. చంద్రబాబు ఇద్దరికీ న్యాయం చేస్తారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## శీతాకాల సమావేశాలెప్పుడు...

**విజయవాడ, జనవరి 7, :** చట్టసభల్లో బలమైన వాణిని వినిపించేందుకు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. అంటే శాసనసభ, శాసనమండలి అన్నమాట. అయితే ఏపీలో మాత్రం చట్టసభల్లో సీరియస్ నెస్ లేదు. రకరకాల కారణాలు చెప్పి సభ్యులు సభకు హాజరు కావడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో శాసనసభకు రామని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతిపక్షం ఉంటేనే శాసనసభకు ఒక ప్రత్యేకత వస్తుంది. అక్కడ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ప్రజాభిప్రాయం కూడా ప్రతిపక్షం ద్వారా వ్యక్తం అవుతుంది. కానీ దురదృష్టవశాత్తు ఏపీలో ప్రతిపక్షం అంటూ లేకుండా పోయింది. కేవలం 11 అసెంబ్లీ సీట్లు రావడంతో టెక్నికల్ గా ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా రాలేదు. రాజకీయ ఉద్దేశ్యంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్నారు. అయితే గతంలో ఇదే టెక్నికల్ ఇష్యూపై మాట్లాడారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు ఆయనే ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు దానిని అధిగమించి.అయితే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాయి. పొరుగున దాయాది రాష్ట్రమైన తెలంగాణలో సైతం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. అయితే ఏపీలో మాత్రం సమావేశాలు జరగలేదు. సాధారణంగా నవంబర్ నుంచి జనవరి వరకు ఈ శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. కానీ ఎందుకో ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదు. జనవరి రెండో వారంలో సమావేశాలు ఉంటాయని అప్పట్లో వార్తలు వచ్చాయి. స్పీకర్ నుంచి కానీ.. డిప్యూటీ స్పీకర్ నుంచి కానీ ఎటువంటి స్పష్టత లేదు. ఈనెల 18 వరకు ఎలాగూ సంక్రాంతి సెలవులు కొనసాగుతాయి. సమావేశాలు పెట్టడం కుదరదు కూడా. అయితే 25 లోగా సమావేశాలు నిర్వహిస్తారనిడ ఐదు నుంచి ఆరు రోజులు కొనసాగిస్తారని తెలుస్తోంది.గతంలో శాసనసభ అంటే ఒక గౌరవభావంతో చూసేవారు. ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు శాసనసభ సమావేశాలు జరిగేవి. వేసవి కాల సమావేశాలు, వర్షాకాల సమావేశాలు, చివరిసారిగా శీతాకాల సమావేశాలు జరిపేవారు. అత్యవసర తీర్మానాల కోసండ అత్యవసర సమావేశాలు కూడా నిర్వహించేవారు. కానీ ఎప్పుడైతే అసెంబ్లీకి ప్రతిపక్షం బహిష్కరిస్తుందో.. ఆ సీరియస్ నెస్ తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు కూడా వైసిపి బహిష్కరించడంతో శాసనసభకు పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు సొంత పార్టీ ఎమ్మెల్యేలను సైతం ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. అయితే ప్రతిపక్షం లేనిదే శాసనసభకు అంత హుందాతనం రాదు. బహుశా ఆ కారణంతోనే శాసనసభ సమావేశాల విషయంలో సరైన నిర్ణయాలు రాలేదని తెలుస్తోంది.

## రాజకీయాలకు విష్ణుకుమార్ రాజు గుడ్ బై

**విశాఖపట్టణం, జనవరి 7, :** బిజెపిలోఆయన సీనియర్ మోస్ట్ లీడర్. మొన్నటి ఎన్నికల్లో గెలిచేసరికి మంత్రి పదవి వస్తుందని భావించారు. పాత తరం బిజెపి నాయకుడు కావడంతో ఇట్టే అవకాశం ఇస్తారని అంచనా వేశారు. ఆపై చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యంతో తనకి పదవి తప్పదని నమ్మకం పెట్టుకున్నారు. అయితే వివిధ సమీకరణలో భాగంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. బిజెపిలో సైతం తగినంత ప్రాధాన్యం లేదు. అందుకే వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బిజెపిలో ఇది హాట్ టాపిక్ గా మారింది. ఇంతకీ ఎవరు ఆ నేత? అంటే విష్ణుకుమార్ రాజు. విశాఖ ఉత్తర నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే2014 ఎన్నికల్లో గెలిచారు విష్ణుకుమార్ రాజు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి. అప్పట్లో కూడా టిడిపి అధికారంలోకి వచ్చింది. బిజెపి రాష్ట్ర ప్రభుత్వంలో చేరింది. అప్పుడు కూడా రెండు మంత్రి పదవులు వచ్చాయి. ఒకటి కామినేని శ్రీనివాస్ కు ఇచ్చారు. ఇంకొకటి మాణిక్యాలరావు దక్కించుకున్నారు. విష్ణుకుమార్ రాజు శాసనసభ పక్ష నేతగా ఉండేవారు. అయితే టిడిపి భాగస్వామ్య పక్షంగా బిజెపి వ్యవహరించేది. చంద్రబాబు నాయకత్వాన్ని విష్ణుకుమార్ రాజు సమర్ధించేవారు. 2018లో ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లిపోయింది తెలుగుదేశం. ఆ సమయంలో కూడా చంద్రబాబు పట్ల గౌరవం గానే ఉండేవారు విష్ణుకుమార్ రాజు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది బీజేపీ నేతలు చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రకటనలు చేసేవారు. ఆ సమయంలో సైతం విష్ణుకుమార్ రాజు చంద్రబాబుకు అనుకూలంగానే ప్రకటనలు చేసేవారు. 2024 ఎన్నికల్లో పొత్తు కుదరడం, టిడిపి కూటమి గెలవడంతో తనకు తప్పకుండా మంత్రి పదవి దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు విష్ణుకుమార్ రాజు. అయితే అటువంటిదేమీ లేకపోవడంతో తీవ్ర ఆవేదనతో ఉన్నారటభారతీయ జనతా పార్టీలో సైతం విష్ణుకుమార్ రాజుకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదు. అది ఆయనకు ఇబ్బందికరంగా మారింది. ఒకానొక దశలో బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి విష్ణుకుమార్ రాజు పేరు ప్రముఖంగా వినిపించింది.

# సాహిత్యమే ఆలంబనగా



మృదుల ఓ సాధారణ కుటుంబంలో పుట్టారు. తండ్రి ప్రోత్సాహంతో సాహిత్య అధ్యయనం ప్రారంభించారు. తల్లి పెంపకంలో సామాజిక విలువలు అలవర్చుకున్నారు. స్వశక్తితో అధ్యాపకురాలిగా ఎదిగారు. యువత, మహిళలను పట్టి పీడుస్తున్న సామాజిక రుగ్మతలపై తన కలాన్ని ఎక్కుపెట్టారు. ఇటీవలె 'రుధిరం నుండి క్షరం దాకా' అంటూ సమాజంలో నేడు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలతో మన ముందుకు వచ్చిన ఆమె పరిచయం నేటి మానవిలోసూర్యాపేట జిల్లా నేరేడుచెర్ల గ్రామంలో పుట్టిన పోరెడ్డి (సిరికొండ) మృదుల వ్యవసాయం చేసుకొనే తల్లిదండ్రుల పెంపకంలో పెరిగారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో, అనుభవజ్ఞులైన గురువుల మార్గదర్శకత్వంలో సాంప్రదాయం, ఆధునికత రెండూ కలగలిసిన భావజాలంతో ఆమె బాల్యం గడిచింది.

అధ్యాపకురాలిగాడిగ్రీలో సైన్స్ స్టూడెంట్ అయిన మృదుల బీఈడీ, ఎంఈడి, ఎంఏ సోషియాలజీ, ఎంఏ తెలుగు పూర్తి చేశారు. మధ్యలో ఎంఈడి పూర్తయిన తర్వాత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2018లో టీఎస్పీఎస్సీ ద్వారా తన ప్రతిభతో అరడజను ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు.సాహిత్యంతో పరిచయంమృదుల తన తండ్రి ప్రభావంతో సాహిత్యంపై ఆసక్తిని పెంచుకున్నారు. చిన్నతనంలో మంచి మంచి సినిమాలు చూసేవారు. అలాగే తండ్రి ప్రోత్సాహంతో బాలభారతం, భక్తతుకారాం, తేనె మనసులు, మూగమనసులు వంటి సినిమాలు చూసి వాటిలోని పాటలు బాగా పాడేవారు. అప్పటి కవులు, రచయితలు రాసినటువంటి పాటలు, మాటలు, ఊరి గ్రంథలయంలో చదివిన సాహిత్యం తెలియకుండానే ఆమెను సాహిత్యం వైపు అడుగులు వేయించింది. ఇక ఎంఏ తెలుగు చేయడంతో పూర్తిగా సాహితీ లోకంలోకి వచ్చేశారు. పోటీ పరీక్షల కోసం చలం, కొడవటి గంటి కుటుంబరావు , శ్రీశ్రీ, దాశరధి, వట్టికోట మొదలగు వారి పుస్తకాలను బాగా చదివేవారు. అధ్యాపకురాలిగా విద్యార్థులకు బోధించే క్రమంలో స్త్రీవాద పుస్తకాలైన నీలిమేఘాలు, విముక్త, స్త్రీ, స్వీట్ హోమ్. వంటి పుస్తకాలతో నిత్య సహచర్యం ఆమె సాహిత్యానికి మరింత పదును పెట్టింది.మహిళా సమస్యలపైమృదుల ఇప్పటి వరకు 'మధుకవనం' కవితా సంపుటి , రుధిరం నుండి క్షరం దాకా, అవిభాజ్యం అనే స్త్రీవాద కవితా సంపుటాలు ముద్రించారు. ఇంకా వివిధ రకాల పరిశోధనా వ్యాసాలు, కథలు రాస్తూ వివిధ సాహితీ సమూహాలలో నిరంతరం చైతన్యంగా ఉంటున్నారు. సమాజంపై సాహిత్యం ఎప్పుడూ కూడా ఆరోగ్యకరమైన ప్రభావమే చూపుతుందని మృదుల బలంగా నమ్ముతారు. పుస్తకంలో ఉండే విజ్ఞానం ఎన్నో తరాలకు చేరవేసే సంపద అంటారు. బట్టలు శరీరాన్ని మాత్రమే కప్పుతాయి. చిరిగిపోయిన తర్వాత ఉపయోగపడవు. కానీ పుస్తకం కప్పి ఉన్న మన మెదడుని తరిగిపోని జ్ఞానంతో విచ్చుకునేలా చేస్తుందంటారు.

కవిత్వమే నేస్తంగాఅధ్యాపకురాలిగా పని చేస్తూనే నిత్య విద్యార్థినిగా నిరంతరం అధ్యయనం చేస్తూ రచనలకు పూర్తి న్యాయం చేస్తున్నారు మృదుల. గురుకుల ఉద్యోగిగా కొన్నిసార్లు 36 గంటలు పని ఒత్తిడితో ఉన్నా కూడా ఎన్నోసార్లు రాత్రిళ్లలో కవితలు రాస్తూ పని ఒత్తిడి నుంచి బయటపడతారు. భర్త సహకారంతో ఉద్యోగాన్ని, కుటుంబాన్ని, సాహిత్యాన్ని సమన్వయం చేసుకుంటున్నారు.చైతన్యం నింపుతూలోతైన పరిశోధనా వ్యాసాలను రాయాలని, ప్రస్తుతం సమాజంలో ఉన్నటువంటి సామాజిక రుగ్మతలుగా తయారైన డ్రగ్స్, మోసం, దోపిడీ , కుల వివక్ష, వరకట్నం, లైంగిక దాడులను నిరసించే రచనలు చేస్తూ సమాజాన్ని చైతన్యం చేస్తున్నారు. అలాగే అధ్యాపక వృత్తిలో మంచి సంతృప్తిని పొందుతూ భవిష్యత్ తరానికి అవసరమయ్యే యువతను తయారు చేస్తున్నారు. సామాన్యులకు సైతం అర్థమయ్యే పదజాలంతో కథలు, వ్యాసాలు, వచన కవిత్వం వంటివి రాసేలా తన భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకున్నారు.అమ్మ నుండే నేర్చుకున్నా..మా కుటుంబంలో రచనలు చేసే వారు ఎవరూ లేరు. పుస్తకాలు చదివే క్రమంలోనే భావోద్వేగాలకులోనై మా అమ్మను, ఆవిడలో ఉన్న కష్టపడే తత్వాన్ని గుర్తు చేసుకున్నప్పుడు నాంతో హార్డ్ వర్క్ చేయాలనిపించింది. సమయాన్ని ఏమాత్రం వృధా చేయకూడదని అప్పుడే నిర్ణయించుకున్నాను. సమాజం కోసం ఏదైనా ఉపయోగపడే పని చేయాలి అనేది అమ్మ నుండే నేర్చుకున్నాను.

# జీవితం అంటే సినిమా కాదు. యువత ఆలోచన చేయండి



నిజజీవితం అంటో రెండున్నరగంటల సినిమా కాదు... అన్నీ మారిపోయి శుభం కార్డు పడడానికి

సమాజంలో జరిగే కొన్ని విషయాలలో ప్రజలను చైతన్య పరిచేందుకు నిజ జీవితంలో జరిగిన కథ, కథనలతో సినిమాలుగా మలిసి

సమాజంలో చిత్ర ప్రదర్శనకు ఏర్పాటు చేస్తారు.దాని వల్ల కొంతమందైన చైతన్యంచెంది జీవితంలో బాగుపడుతారు, రియాలైజ్ అవుతారని జీవితంలో జరిగిన తప్పులు మళ్ళీ జరుగకుండా జాగ్రత్త పడుతారని ఆశాభావంతో సినిమా నిర్మాణం చేసి ప్రజల ముందుకు పంపుతారు.అంతేగాని సినిమా లాగా జీవితాలు ఉండవని నేటి యువత గమనించగలరని ఇక్కడ మనం ఒక కుటుంబ ప్రస్తావన పరిశీలన చేద్దాం చూడండి.జరిగిన విషయం చాలా స్పష్టంగా సమాజంలో నడుస్తున్న విధానంలో చట్టం చెప్పిన్నట్టు హక్కులు పొందుటకోసం కని పెంచి సకల సౌకర్యాలు కల్పించి సమాజంలోగుర్తింపు స్థాయి కలిగిన వెంటనే పశు ,పక్షులుగా... ప్రవర్తించి కన్న వారిని కాదని, బాల్య దశలో పెంచిన, పెరిగిన విధానం మర్చిపోయిన విధానం మనం ఇక్కడ పరిశీలన చేయవచ్చు. చూడండి అందరం ఆలకిద్దాంఒకసారి 45 ఏళ్ల వయసున్న ఒకామె కోర్టు మెట్లు ఎక్కింది.జడ్జిగారి ముందు ఆమె ఇలా విన్నవించుకుందొ "మా వారికి ఆరోగ్యం బాగాలేదు. మాకు ఒక పాప ఉంది. నేను అందరి ఇళ్లలో పనిచేసి తెచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. అందరినీ అడుక్కుని ఎలాగోలా నా కూతురికి మంచి చదువు చెప్పించాను.మా అమ్మాయిని ఎటువంటి కష్టం తెలియకుండా పెంచాను. అమ్మాయి కూడా బాగా చదివి ఉద్యోగం సంపాదించుకుంది. ఇక మా కష్టాలు తీరాయి అనుకునే లోపు అమ్మాయి కనిపించకుండా పోయింది. ఎవరైనా మాయమాటలు చెప్పి మోసంచేసి ఎత్తుకుపోయారేమోఁ.... అని చెప్పింది.జడ్జిగారు ఆ విషయం గురించి పూర్తిగా విచారించగా, ఆ రోజు వాళ్ళ అమ్మాయి కోర్టుకు వచ్చింది.బోనులో ఎదురెదురుగా తల్లి కూతుర్లు. ఆ అమ్మాయి కళ్ళలో ఏమాత్రం ప్రేమ కనిపించలేదు. తప్పు చేశానన్న పశ్చాత్తాపమూ లేదు.ఆ అమ్మాయి... "నన్ను ఎవరూ మోసం చేయలేదు. నన్ను ఎవరూ ఎత్తుకుని పోలేదు. నేను మేజర్ ని. నాకు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నాను." అని చెప్పింది.ఇంట్లో వాళ్లకు ఒక్కమాటైనా చెప్పాలి కదా!.... అని అడగాలని అనుకున్నా, కోర్టులో ఇలాంటి సంభాషణలు ఉండరాదు. కనుక ఒక గంటసేపు తల్లి కూతుర్లు మాట్లాడుకోవలసిందిగా జడ్జిగారు తీర్పు ఇచ్చారు.జడ్జిగారి ఆశ ఏంటంటే... ఒకవేళ ఆ తల్లీకూతుళ్ళు కలిసి మాట్లాడుకుంటే, ఆ తల్లి కష్టాన్ని కూతురు అర్థం చేసుకుంటుందని, గతాన్ని తలచి ఆమె మారుతుందేమో అని.ఆయనకూ మనసు ఉంది కదా! అందుకే ఆలోచించి అలా చెప్పారు.ఒక గంట తరువాత మళ్ళీ వచ్చిన తల్లి కూతుర్లు ఎదురుగా నిలబడ్డారు. కానీ, ఎటువంటి మేజిక్కూ జరగలేదు.అమ్మ ఒక నిశ్చయానికి వచ్చి, "ఇక అమ్మాయి ఇష్టం అండీ... తను సంతోషంగా ఉంటే మాకు అంతే చాలు. ఒక్కమాట... వాళ్ళ నాన్నతో వెళ్ళొస్తానని చెప్పమనండి. ఆయనకు ఆ పిల్లంటే ప్రాణం" అని తల్లి చెప్పింది."వాళ్ళ నాన్న ఎక్కడ?" అని అడగగా... అతను ఒక మూలన కూర్చుని ఇవన్నీ గమనించి కన్నీరు పెట్టుకుంటున్నాడు. అతను వికలాంగుడు అతనిని ఒకరు ఆసరాగా పట్టుకుని ఉన్నారు.అయినా ఏమాత్రం మనసు కరగని ఆ అమ్మాయి "ఇక నేను వెళ్లొచ్చా"... అని అడిగి బయట తన భర్త వేచిచూస్తున్న కార్ ఎక్కి వెళ్లిపోయింది.ఆ అమ్మాయిని శిక్షంచడానికి కోర్టుకి అధికారం లేదు. ఃఆర్డర్ వేసి ఇవి ఆచరించి తీరాలిః అని చెప్పడానికి ఇంకా చట్టాలు రాలేదు.జడ్జిగారు ఆ అమ్మను ఉద్దేశించి... "ఇప్పుడెలా వెళతారు?" అని అడిగితే... "బస్టాండ్ లో నలుగురి దగ్గర అడుక్కుని మా ఊరువెళ్ళిపోతాం. అక్కడ మళ్ళీ ఇళ్లలో పనిచేసుకుని మా బతుకులు ఈడ్చేస్తాం." అని అంటుంటే అక్కడ అందరి కళ్ళలో కన్నీళ్లు.కోర్టు నుండి బయటకు వచ్చిన జడ్జిగారు ఆమెకు వెయ్యి రూపాయలు ఇవ్వగా, అక్కడ ఉన్నవారంతా తోచిన సాయం చేసి పంపారు.సినిమాల్లో లాగా నిజ జీవితాల్లో మార్పులు ఉండవు.తప్పు చేశామేమో అనే పశ్చాతాపం ఉండదు. చట్టం కూడా కొన్నిసార్లు మౌనంగా చూస్తూ ఉండాలి అంతే మన పిల్లలకు మన కష్టం తెలియకుండా పెంచాలి అని అనుకోవడమే పొరపాటు.ప్రేమను పంచినట్టే కష్టాన్ని కూడా పంచండి. అప్పుడైనా కాస్తంత మానవత్వంతో మనుషులుగా మిగిలిఉంటారు. లేకపోతే మానవత్వాన్ని మరిచిపోయి, ప్రేమగా పెంచిన తల్లిదండ్రుల్ని నిర్దాక్షణ్యంగా గాలికొదిలేసి తమదారిన తాము

# ఇవి తెలుసుకుంటే



జీవితంలో స్సస్ అనేది ఎవ్వరికీ అంత ఈజీగా రాదు. అనుకున్నది సాధించాలంటే ఎంతో కష్టపడాలి. అలాంటి విజయాన్ని సాధించడానికి ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయా లేంటి? మనల్ని మనం ఎలా తీర్చిదిద్దుకుంటే విజయం వరిస్తుందో అన్న విషయంపై నిపుణులు ఏం చెబుతున్నారో చూద్దారౌసంతోషంసంతోషం, ఆనందం అనేవి కేవలం ఫీలింగ్స్ మాత్రమే కావు.. అదొక లైఫ్ స్టైల్ లాంటిది. మనం చేసే పనిలో మనకు సంతృప్తి లేనట్టయితే, అందులో విజయాన్ని పొందడం కష్టం. అందుకే చేసే పనిని ఇష్టంగా చేయడం అలవాటు చేసుకోవాలి. అందులోనే సగం విజయం సొంతమైనట్టే.నమ్మకంమనం చేసే పనిపై పూర్తి నమ్మకం ఉండాలి. ఏదైనా సాధించగలం అని బలమైన నమ్మకం ఉంటే అసాధ్యం కూడా సుసాధ్యమవుతుంది.లక్ష్యంలక్ష్యం లేని జీవితం వ్యర్థం. జీవితంలో పైకి ఎదగాలంటే ముందుగా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఆ లక్ష్య సాధనకి కృషి చేయాలి.పట్టుదలచేసే పని ఏదైనా పట్టుదల ప్రదర్శించాలి. మనం చేయడానికి ఇప్పుడు ఇదొక్క పనే వుందన్నట్టుగా పట్టుదలతో పనిచేయాలి. మనకున్న పట్టుదలే విజయాన్ని సాధించిపెడుతుంది.స్పూర్తినిచ్చిన విషయాల నుంచి, వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొందాలి. ఆ ప్రేరణే మనల్ని ముందుకు నడిపిస్తుంది. విజయం వరకు వెంట తీసుకెళు ్తుంది.విశ్వాసంమీరు తలుచుకుంటే చేయలేనిది అంటూ ఏదీ లేదు. ధృడమైన విశ్వాసం ఒక్కటే మనల్ని విజయవంతమైన మనిషిగా తీర్చిదిద్దుతుంది. మనలో వున్న శక్తిని మనమే నమ్మకపోతే ఇంకెవరు నమ్ముతారు. అది గ్రహించినప్పుడే విజయం దరి చేరుతుంది.విలువలువిలువలు పాటించే విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దు. ఎందుకంటే విలువలు లేకుండా అడ్డదారిలోనూ విజయం సాధించొచ్చేమో కానీ ఆ విజయాలకి విలువ వుండదని గ్రహించాలి. విలువలు లేని విజయం మీకు సరైన వ్యక్తిత్వం లేకుండా చేస్తుందనే సత్యాన్ని తెలుసుకోవాలి.జీవితం పట్ల అవగాహనజీవితం ఎలా వుండాలి అనే విషయంలో ఒక సరైన అవగాహన వుండాలి. జీవితం అలా వుండటం కోసం కృషిచేయాలి. అప్పుడే మీ కలలు నిజం అవుతాయి.సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధంగాజీవితంలో ఎప్పుడైనా, ఏ సవాళ్లయినా ఎదురు కావచ్చు. ఆ సవాళ్లను ఎదుర్కోవడానికి వెనుకాడకుండా సిద్ధంగా వుండాలి.

## ఆకులపై అద్భుత చిత్రాలు

నైపుణ్యం అనేది ఒకరి సొత్తు కాదు. నేర్చుకోవాలనే తపన ఉండాలే కానీ దాన్ని ఎవరైనా సొంతం చేసుకోవచ్చు. అలాగే పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని నిరూపిస్తోంది కల్లెం ధనుజ. తన ఆలోచనలను ప్రకృతిలో దొరికే ఆకులపై ప్రతిబింబిస్తుంది. అద్భుతమైన నైపుణ్యంతో అందమైన చిత్రాలతో అందరి ప్రశంసలు అందుకుంటోంది. లీఫ్ ఆర్ట్‌తో పాటు పెయింటింగ్, ఎస్సే రైటింగ్, గానం వంటి పలు రంగాల్లో రాణిస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇలా ప్రకృతినే కాన్వాస్‌గా మార్చిన యాదాద్రి యువతి పరిచయం నేటి మానవియాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన కల్లెం సాయిలు, పార్వతమ్మ దంపతుల బిడ్డ కల్లెం ధనుజ. నిరుపేద కుటుంబంలో పుట్టినా, ప్రతిభకు పేదరికం అడ్డుకాదని తనలోని నైపుణ్యంతో నిరూపించింది. చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఆమె చదువుతో పాటు కళలపై ప్రత్యేక ఆసక్తి పెంచుకుంది.కరోనా కాలమే కళకు కొత్త దారిప్రస్తుతం నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ధనుజ, ఉపాధ్యాయ వృత్తితో పాటు తనలోని కళాకారిణిని మరింత మెరుగు పరుచుకుంటోంది. 'ఏదైనా కొత్తగా కనిపిస్తే దాన్ని కళారూపంలో తీర్చిదిద్దాలనే తపన చిన్నప్పటి నుంచే ఉంది' అని ఆమె చెబుతుంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆన్‌లైన్‌లో లీఫ్ ఆర్ట్ కళాకారుడు గుండు శివకుమార్ నైపుణ్యాలను చూసి ఆశ్చర్యపోయిన ధనుజ తను కూడా ఆ కళను నేర్చుకోవాలనుకుంది. అనుకున్న వెంటనే దాన్ని ఆచరణలో పెట్టింది. పట్టుదలతో లీఫ్ ఆర్ట్ నేర్చుకుంది.చెట్టు ఆకులతొలుత కాలుగచెట్ల ఆకులపై చిన్న చిన్న డిజైన్లు, పేర్లు రాయడం ప్రారంభించింది. ఆ తర్వాత రావిచెట్టు ఆకులపై స్వాతంత్ర్య సమరయోధులు, దేవుళ్లు, రాజకీయ నాయకులు, ప్రముఖుల ముఖచిత్రాలను అద్భుతంగా చెక్కడం నేర్చుకుంది. అలాగే బర్త్‌డేలు, మ్యారేజ్‌డేలు, ప్రత్యేక సందర్భాలకు అనుగుణంగా ఆకులపై చిత్రాలు వేసి సంబంధిత వ్యక్తులకు బహుమతిగా పంపిస్తోంది. ఇప్పటివరకు వందకు పైగా లీఫ్ ఆర్ట్ చిత్రాలు రూపొందించి ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.కుటుంబమే నా బలంతన విజయానికి కుటుంబ ప్రోత్సాహమే ప్రధాన కారణమని ధనుజ గర్వంగా చెబుతుంది. ముఖ్యంగా తన అక్క ధర్మమణి తన బ్యాక్‌బోన్ అంటుంది. 'విఠౌట్ హర్ ఐ ఆం నథింగ్. చిన్నప్పటి నుంచి ప్రతి రంగంలో ముందుండాలని మా అక్క నన్ను నిత్యం ప్రోత్సహించింది. అవసరమైన సామగ్రి అందిస్తూ, నా ఆలోచనలకు బలం ఇచ్చింది' అంటూ ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.విద్యలోనూ శిఖరంకళల్లోనే కాదు విద్యారంగంలోనూ ధనుజ అసాధారణ ప్రతిభ కనబరిచింది. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పీజీ (తెలుగు) పూర్తి చేసి, యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకం అందుకుంది. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగిన 23వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ గోల్డ్ మెడల్‌ను స్వీకరించింది. 2021లో ఈ ఘనత సాధించగా, ఆమె విజయం జిల్లాకే గర్వకారణంగా నిలిచింది.మహిళలకు సందేశం'పట్టుదల ఉంటే ఆడపిల్లలు ఏ రంగంలోనైనా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు. అవకాశం కోసం ఎదురు చూడకుండా, మనలోని ప్రతిభను మనమే వెలికితీయాలి' అని ధనుజ యువతకి పిలుపునిస్తోంది. లీఫ్ ఆర్ట్‌తో పాటు మరిన్ని కళారంగాల్లో తన ప్రయాణాన్ని మరింత విస్తరించాలని, ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తే ఈ కళను అంతర్జాతీయ స్థాయికి తీస్కుళ్లాలని ఆమె ఆకాంక్ష. గ్రామస్తులు కూడా ధనుజలాంటి ప్రతిభావంతులను గుర్తించి ప్రభుత్వాలు చేయూతనివ్వాలని కోరుతున్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ, కళను సాధనగా చేసుకుని, విద్యను ఆయుధంగా మలుచుకున్న కల్లెం ధనుజ నేటి యువతికి నిజమైన ఆదర్శం.

## వాస్తవాలను తెలుసుకోండి నిజమా కదా ఆలోచన చేయండి.

మనిషి ఇరుక్కున్నాడు మెగా గ్లోబలైజేషన్ లోభ్రమ్ముల మోతను సంగీతమంటున్నారు. !పీలికబట్టల్ని వస్త్ర ధారణ అంటున్నారు.!భౌతిక అకర్షణను ప్రేమని పిలుస్తున్నారు.! సహజీవనాన్ని సంసారమంటున్నారు.!గ్రాఫిక్ గిమ్మిక్కులను సినిమా అంటున్నారు.!దూప్ ల పోరాటాన్ని హీరోయిజం అంటున్నారు.!పదవుల పోరాటాన్ని ప్రజాస్వామ్యమంటున్నారు.అధికార ఆరాటాన్ని రాజకీయమంటున్నారు.!ఆస్తుల పంపకాన్ని కుటుంబం అంటున్నారు.!దారితప్పిన సరదాలను సంస్కృతి అంటున్నారు.! భుక్తి మార్గాన్ని చదువు అంటున్నారు.!కోరిన కోర్కెలు తీరిస్తేనే... దేవుడంటున్నారు.!ఆస్తి ఉంటేనే... గొప్పవాడు అంటున్నారు.!మందు పోయిస్తేనే...మిత్రుడు అంటున్నారు.! కట్నం తెస్తే...భార్య అంటున్నారు.!సొమ్ములు తెస్తేనే... సంసారం అంటున్నారు.! కాసులు తెస్తేనే... కాపురం అంటున్నారు.!నిజాయితీగా ఉంటే... అసమర్థుడంటున్నారు.!సక్రమంగా ఉంటే... అమాయకుడంటున్నారు.!అసత్యాలు మాట్లాడితే... బ్రతక నేర్చిన వాడంటున్నారు.!నిజం పలికితే... నీ ్ందుకు పోవోయ్ అంటున్నారు..!న్యాయబద్ధంగా ఉంటే... ఎలా బ్రతుకుతాడో అంటున్నారు.!అన్యాయంగా బ్రతికినా... స్సస్...ఎంచక్కా ఉన్నాడంటున్నారు.!అన్యాయాన్ని ఎదిరిస్తే... అతనైందుకు అంటున్నారు.!నిజాయితీగా బ్రతికితే... కూడుపెడుతుందా అంటున్నారు.!మాయకమ్మిన జీవితాన్ని శాశ్వతమనుకుంటున్నారు.!మరణమనే మహా సత్యాన్ని విస్మరిస్తున్నారు.!పరిస్థితులకు అనుగుణంగా పాత అర్థం చెరిగిపోయి, ప్రయోజనాలకు అండగా... సరికొత్త పరమార్థం ఆవిర్భవిస్తోంది.!స్వార్థ కాంక్షణుగుణంగా... విపరీతార్థం ఆవిష్కృతమవుతోంది.!ఇదే గ్లోబలైజేషన్ మహిమ అంటేటెక్నాలజీ పెరిగింది...సౌకర్యం పెరిగింది...విలాసం పెరిగింది...విజ్ఞానం పెరిగింది...కాలుష్యం పెరుగింది...ఖర్చు పెరిగింది...కల్తీ పెరిగింది...రసాయన బంధం పెరిగింది...అన్నీ పెరిగాయి...కానీ! పెరుగుట విరుగుట కొరకే అన్నట్లుమన ఆయుష్ ప్రమాణం మాత్రం 50% పైగా తగ్గింది..రోగం తెలియని చికిత్సలౌశవాలకు రక్తపరీక్షలు...విద్య పెద్ద వ్యాపారం...వ్యాధి ఇంకా పెద్ద వ్యాపారం దహించనున్న గ్లోబల్ వార్నింగ్.... భావితరాలకు వార్నింగౌఅయినా బాధ్యత లేనట్లు..

# తెగిడిన నోళ్లే.. పొగిడేలా

## మహిళల ప్రీమియర్ లీగ్

## డబ్ల్యూపీఎల్-4 రేపటి నుంచే



కొన్నేళ్ల ముందు ఐపీఎల్ తరహాలోనే మహిళల కోసం బీసీసీఐ ఒక లీగ్ మొదలు పెట్టాలని చూస్తోందని వార్తలు వచ్చినపుడు.. అది ఏమాత్రం విజయవంతం అవుతుందో అని సందేహించిన వాళ్లే ఎక్కువమంది. బీసీసీఐకి డబ్బులు ఎక్కువై ఇలా చేస్తోందని.. అమ్మాయిల ఆట చూడడానికి ఎవరు వస్తారనే వ్యాఖ్యానాలు చేసిన వాళ్లు లేకపోలేదు!

కానీ ఇప్పుడు అమ్మాయిలు ఆడుతుంటే స్టేడియాలు నిండుతున్నాయి. వాళ్ల కోసం పెట్టిన లీగ్ అద్భుత ఫలితాలను అందిస్తోంది. ఆ లీగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోసారి స్టేడియాలు నిండిపోవడం ఖాయంగా కనిపిస్తోంది! ఒకప్పుడు తెగిడిన నోళ్లే ఇప్పుడు పొగిడేలా.. ఇంతింతై అన్నట్లు ఎదుగుతోంది మహిళల ప్రిమియర్ లీగ్!భారత క్రికెట్లో ఐపీఎల్ ఎంత గొప్ప మార్పు తెచ్చిందో తెలిసిందే. దేశంలో వందల మంది యువ క్రికెటర్లు ప్రతిభ చాటుకోవడానికి ఈ లీగ్ వేదికగా నిలిచింది. అందులో పదుల సంఖ్యలో యువ ఆటగాళ్లు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఎంతోమంది స్టార్లుగానూ ఎదిగారు. అంతర్జాతీయ క్రికెటర్లతో డ్రెస్సింగ్ రూంను పంచుకోవడం, వారితో పోటీ పడడం క్రికెటర్ల ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచింది. ఇప్పుడు వైభవ్ సూర్య వంశీ లాంటి చిన్న కుర్రాడు కూడా అదురు బెదురు లేకుండా ఆడుతున్నాడంటే దీని వెనుక ఐపీఎల్ పాత్ర ఎంతో కీలకం. మహిళల క్రికెట్లో కూడా డబ్ల్యూపీఎల్ ఇలాంటి సానుకూల మార్పునే తీసుకొచ్చింది. రిచా ఘోష్ సహా పలువురు యువ క్రికెటర్లను ఈ లీగ్ వెలుగులోకి తెచ్చింది. ఒకప్పుడు కూడా భారత జట్టులో ప్రతిభావంతులు ఉన్నా.. ఆత్మవిశ్వాస లోపం వెంటాడేది. ఆటలో దూకుడు తక్కువగా ఉండేది. కాబట్టే అంతర్జాతీయ క్రికెట్లో నిలకడగా విజయాలు సాధించలేకపోయేది. ఐసీసీ ఈవెంట్లలో కీలక దశల్లో తడబడేది.

కానీ గత ఏడాది చివర్లో వన్డే ప్రపంచకప్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఎంత గొప్పగా ఆడి ప్రపంచకప్ గెలిచిందో తెలిసిందే. గతంలో ఆస్ట్రేలియా అంటే చాలు.. ముందే జావగారిపోయేవాళ్లు మన అమ్మాయిలు. కానీ ప్రపంచకప్ ముంగిట ఓ మ్యాచ్‌లో ఆ జట్టును 100కు పైగా పరుగుల తేడాతో ఓడించి సంచలనం సృష్టించారు. మరో మ్యాచ్‌లో 400 పైచిలుకు లక్ష్యం ముందున్నా.. విజయం కోసం గట్టిగా ప్రయత్నించారు. ఈ ఆత్మవిశ్వాసం, దూకుడే.. ప్రపంచకప్ సెమీస్‌లో కంగారూలపై 339 పరుగుల రికార్డు లక్ష్య ఛేదనతో చరిత్ర సృష్టించడానికి, దక్షిణాఫ్రికాపై ఫైనల్లోనూ గెలిచి ప్రపంచకప్ గెలవడానికి దోహదపడింది. అమ్మాయిల దృక్పథం, ఆటతీరులో ఇంత గొప్ప మార్పునకు డబ్ల్యూపీఎల్ ఓ ముఖ్య కారణం అనడంలో సందేహం లేదు. **ఉందిలే మంచి కాలం..:** డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటిదాకా మూడు సీజన్లు జరిగాయి. శుక్రవారమే నాలుగో సీజన్ ఆరంభం కాబోతోంది. మూడేళ్ల ముందుతో పోలిస్తే ఇప్పుడు లీగ్‌లో మార్పు స్పష్టం. భారత అమ్మాయిల ఆటలో వేగం పెరిగింది. ఆత్మవిశ్వాసం సంగతి చెప్పాల్సిన పని లేదు. డబ్ల్యూపీఎల్‌లో సత్తా చాటుకుని.. బిగ్ బాష్ లీగ్, ది హండ్రెడ్ లాంటి లీగ్‌ల్లోనూ మన అమ్మాయిలు ఎక్కువమంది ఆడుతున్నారు. ప్రతి సీజన్లోనూ కొత్త అమ్మాయిలు వెలుగులోకి వస్తున్నారు. ఇప్పటికే ఉన్న స్టార్ల ఆట కూడా మెరుగుపడుతోంది. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలి వర్మ, దీప్తి శర్మ.. అంతర్జాతీయ స్థాయిలో మేటి క్రికెటర్లుగా గుర్తింపు తెచ్చుకున్నారు. గత సీజన్ వరకు ఓ మోస్తరు స్థాయిలో ఉన్న జెమీమా రోడ్రిగ్స్ ఇప్పుడు పెద్ద స్టార్‌గా అవతరించింది. తెలుగమ్మాయి శ్రీ చరణి ప్రపంచ అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరిగా పేరు తెచ్చుకుంది. ఇంకా రేణుక సింగ్, క్రాంతి గౌడ్, రాధ యాదవ్, స్నేహ్ రాణా లాంటి క్రికెటర్లకు మంచి గుర్తింపే ఉంది.

రాబోయే కొన్నేళ్లలో మరెంతో మంది కొత్త అమ్మాయిలు వెలుగులోకి వస్తారని, భారత జట్టును బలోపేతం చేస్తారనే అంచనాలు ఉన్నాయి. విదేశీ క్రికెటర్లు కూడా డబ్ల్యూపీఎల్‌లో ఆడేందుకు అమితాసక్తి చూపిస్తున్నారు. వివిధ జట్లకు చెందిన అగ్రశ్రేణి క్రికెటర్లు లీగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. డబ్ల్యూపీఎల్ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. ప్రపంచకప్ విజయంతో సంతృప్తి చెందకుండా వివిధ ఫార్మాట్లలో నిలకడగా విజయాలు సాధించడం, అగ్ర జట్టుగా ఎదగడం, మరిన్ని ఐసీసీ టోర్నీల్లో గెలవడం భారత జట్టు తర్వాతి లక్ష్యాలు. ఆ లక్ష్యాలను అందుకోవడానికి డబ్ల్యూపీఎల్ ఉత్ప్రేరకంలా పని చేస్తుందన్నది విశ్లేషకుల మాట. డబ్ల్యూపీఎల్‌కు అంతకంతకూ ఆదరణ పెరుగుతుండడం.. భారీగా ఆదాయం వస్తుండడం.. వేలం ద్వారా అమ్మాయిలు కోటీశ్వరులవుతుండడంతో దేశంలో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే అమ్మాయిల సంఖ్యా గణనీయంగా పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కాబట్టి రాబోయే రోజుల్లో డబ్ల్యూపీఎల్‌ను ఇంకా పెద్ద స్థాయిలో చూడబోతున్నామన్నది స్పష్టం."వచ్చే అయిదు పదేళ్లలో భారత జట్టును ఓడించడం కష్టంగా మారుతుందనిపిస్తోంది. ఇది ఉత్సుకత రేకెత్తించే విషయం. ఒక ఆస్ట్రేలియా అమ్మాయిగా మాకిది ఇబ్బందికరమే. అయినా సరే.. భారత్‌లో అమ్మాయిల క్రికెట్ వేగంగా ఎదుగుతున్న తీరు గొప్పగా అనిపిస్తోంది"

# శతక్కొట్టిన సూర్యవంశీ, ఆరోన్

## యూత్ వన్డే సిరీస్‌లో 3-0తో భారత్ క్లీన్‌స్వీప్



బెనోని: ఫార్మాట్ మారినా, టోర్నీ మారినా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటతీరులో మాత్రం మార్పు లేదు. అతడి పరుగుల ప్రవాహం ఆగట్లేదు. వరుస సెంచరీలతో చెలరేగుతున్న అతడు.. దక్షిణాఫ్రికాతో అండర్-19 వన్డే సిరీస్‌లో మరో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. బుధవారం మూడో యూత్ వన్డేలో కెప్టెన్ సూర్యవంశీ (127; 74 బంతుల్లో 9ఐ4, 10ఐ6)కి తోడు మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ (118; 106 బంతుల్లో 16ఐ4) కూడా మెరుపు శతకం బాదడంతో భారత్ 233 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి, సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మొదట భారత్ 7 వికెట్లకు 393 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి ఫోర్లు సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన వైభవ్, జార్జ్ ద్వయం తొలి వికెట్‌కు 25.4 ఓవర్లలో 227 పరుగుల పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎన్‌టాండో సోని (3/61) జేసన్ రోల్స్ (2/59) మినహా బౌలర్లంతా పరుగులు ఇచ్చుకోవడంలో పోటీపడ్డారు. 63 బంతుల్లోనే సెంచరీ అందుకున్న వైభవ్.. మరింత వేగంగా ఆడే ప్రయత్నంలో ఔటయ్యాడు. అతడు వెనుదిరిగాక పరుగుల వేగం కాస్త తగ్గింది. భారీ లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చతికిలపడింది. 35 ఓవర్లలో 160 పరుగులకే కుప్పకూలింది. డానియల్ బోస్మన్ (40), పాల్ జేమ్స్ (41), కార్న్ బోథా (36) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. కిషన్ సింగ్ (3/13) మొహమ్మద్ ఎనాన్ (2/36) విజృంభించారు. వైభవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను సొంతం చేసుకున్నాడు.

# జై హనుమాన్ ని పక్కన పెట్టిన రిషబ్ శెట్టి..?





రిషబ్ శెట్టి ఇప్పుడు పాన్ ఇండియా లెవెల్ లో బిజీగా ఉన్న స్టార్. కాంతారా రెండు సినిమాలతో ఆయన చేసిన హంగామా తెలిసిందే. యాక్టింగ్, డైరెక్షన్ రెండు చేస్తూ ఈ రేంజ్ ఇంపాక్ట్ చూపించడం అనేది ఒక గొప్ప విషయం. అందులో తన సత్తా చాటాడు రిషబ్ శెట్టి. కాంతారా తో నేషనల్ వైడ్ గా క్రేజ్ తెచ్చుకున్న రిషబ్ శెట్టితో తెలుగు మేకర్స్ భారీ సినిమాలు చేస్తున్నారు. ఆల్రెడీ హనుమాన్ సీక్వెల్ గా జై హనుమాన్ సినిమా చేస్తున్నాడు. ఆ సినిమాతో పాటు సితార బ్యానర్ లో ఒక సినిమా సైన్ చేశారు.

**కాంతారా చాప్టర్ 1 తర్వాత రిషబ్ శెట్టి జై హనుమాన్..**

ఐతే మరోపక్క ఛత్రపతి శివాజీ కథతో రిషబ్ శెట్టి ఒక భారీ సినిమా ప్లానింగ్ లో ఉంది. అందులో వివేక్ ఒబెరాయ్ కూడా నటిస్తున్నారు. కాంతారా చాప్టర్ 1 తర్వాత అసలైతే రిషబ్ శెట్టి జై హనుమాన్ చేయాలి. కానీ ప్రశాంత్ వర్మ ఇంకా లేట్ చేసేలా ఉన్నాడని శివజీ సినిమాను ముందు చేసే ప్లానింగ్ లో ఉన్నారట రిషబ్ శెట్టి. అలా ఐతే జై హనుమాన్ మరింత వెనక్కి వెళ్లే ఛాన్స్ ఉంటుంది.

హనుమాన్ సినిమా చివర్లో జై హనుమాన్ అనౌన్స్ చేసి 2025 రిలీజ్ అని చెప్పారు మేకర్స్. కానీ హనుమాన్ సినిమా నిర్మాతలతోనే ప్రశాంత్ వర్మ ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవలు జరగడం.. ఇంకా సీక్వెల్ ప్రాజెక్ట్ చేతులు మారడం లాంటివి జై హనుమాన్ ని మరింత లేట్ చేస్తున్నాయి. టాలెంట్ ఉన్నా కూడా ప్రశాంత్ వర్మ వరుస సినిమాల కమిట్మెంట్ వల్ల అతన్ని ఇబ్బందుల్లో పడేశాయి.

**తెలుగులో రెండు భారీ ప్రాజెక్ట్స్..**

జై హనుమాన్ అసలైతే జనవరి కల్లా సెట్స్ మీదకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. కానీ ఇంకా దానికి సంబంధించిన అప్డేట్ ఐతే ఏది రాలేదు. ఒకవేళ సినిమా మరింత లేట్ అయ్యేలా ఉందంటే రిషబ్ తన డేట్స్ అన్నీ శివాజీ కథకు ఇచ్చేలా ఉన్నాడు. అదే జరిగితే జై హనుమాన్ మరింత లేట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. మొత్తానికి జై హనుమాన్ విషయంలో ఫ్యాన్స్ అంత ఆసక్తిగా ఉన్నారో అంత వెనక్కి వెళు ంది. రిషబ్ శెట్టి మాత్రం తెలుగులో రెండు భారీ ప్రాజెక్ట్ లతో పాటు మరో రెండు సినిమాలను ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలతో నేషనల్ లెవెల్ లో రిషబ్ శెట్టి స్టామినా ప్రూవ్ చేయనున్నారు. ప్రశాంత్ వర్మ తన సినిమాల విషయంలో ఒక క్లారిటీ రాలేకపోతే కెరీర్ మీద ఎఫెక్ట్ పడేలా ఉంది. జై హనుమాన్ ని ఎంత త్వరగా మొదలు పెడితే అంత బాగుంటుంది. ఒకవేళ ఆ ప్రాజెక్ట్ ఇంకా లేట్ అయితే మాత్రం ప్రశాంత్ వర్మ రిస్క్ లో పడినట్టే అవుతుంది. జై హనుమాన్ తో పాటు ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో మరికొన్ని సినిమాలు ప్లాన్ చేస్తున్నాడు. ఆల్రెడీ మహాకాళి సినిమాకు ప్రశాంత్ వర్మ కథ అందిస్తున్నాడన్న విషయం తెలిసిందే. ఐతే మిగతా సినిమాల విషయంలోనే ఒక క్లారిటీ రావాల్సి ఉంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com